




# విజయభాను

45వ వార్షికోత్సవం విజయభాను

విశాఖపట్నం, గురువారం 30-09-2021 | VIJAYABHANU DAILY ✱ VISAKHAPATNAM | సంపుటి : 45 సంచిక : 17 పేజీలు : 8 వెల : 1 రూపాయి



## ‘వంశధార’పై తుది తీర్పు అమలు చేయండి

- వీడబ్ల్యూడీటీ ఆదేశాలను పాటిస్తూ తక్షణమే గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వాలి
- నేరడి బ్యారేజీ ఫలాల కోసం శ్రీకాకుళం జిల్లా రైతుల ఎదురుచూపులు
- కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు సీఎం వైఎస్ జగన్ లేఖ



అమరావతి: వంశధార నదీ జలాలపై ట్రిబ్యునల్ తుది తీర్పును అమలు చేస్తూ గెజిట్ నోటిఫికేషన్ జారీకి చర్యలు తీసుకోవాలని కోరుతూ కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాజాగా మరోసారి లేఖ రాశారు. ‘వంశధార నదీ జలాలను ఆంధ్రప్రదేశ్, ఒడిశాలకు పంపిణీ చేస్తూ వీడబ్ల్యూడీటీ (వంశధార జల వివాదాల ట్రిబ్యునల్) నాలుగేళ్ల క్రితం 2017 సెప్టెంబర్ 13న తీర్పు ఇచ్చింది. 2021 జూన్ 21న తుది తీర్పు కూడా వెలువడింది. ఈ అవార్డు ఎప్పుడెప్పుడు అమల్లోకి వస్తుందా? నేరడి బ్యారేజీ నిర్మితమవుతుందా..? వంశధార జలాలతో తమ పొలాలు ఎప్పుడెప్పుడు సస్యశ్యామలమవుతాయా..? అని అత్యంత వెనుకబడిన శ్రీకాకుళం జిల్లా ప్రజలు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. నేరడి బ్యారేజీ నిర్మాణం కాకపోవడం వల్ల ఏటా వంశధార జలాలు వృథాగా కడలిపాలవుతున్నాయి. దయచేసి వీడబ్ల్యూడీటీ అవార్డును తక్షణమే అమలు చేసేలా గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయండి. రాష్ట్ర ప్రయోజనాలను పరిరక్షించండి’ అని లేఖలో సీఎం జగన్ విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్, ఒడిశాల మధ్య వంశధార జలాల వివాదాన్ని పరిష్కరిస్తూ వీడబ్ల్యూడీటీ ఇచ్చిన తీర్పును అమలు చేయాలని కోరుతూ 2019 జూన్ 27న షెకావత్‌కు సీఎం జగన్ గతంలో లేఖ రాశారు. అంతర్రాష్ట్ర నదీ జల వివాదాల(ఐఎస్ఆర్‌డబ్ల్యూడీ) చట్టం-1956 సెక్షన్-6(1) ప్రకారం వీడబ్ల్యూడీటీ తుది తీర్పు అమలుకు గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయాలని కోరుతూ మరోసారి లేఖ రాశారు.

వంశధార జల వివాదాన్ని పరిష్కరిస్తూ వీడబ్ల్యూడీటీ తుది తీర్పును 2021 జూన్ 23న కేంద్ర ప్రభుత్వానికి అందజేసింది. వంశధారపై నేరడి బ్యారేజీని నిర్మించుకునేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి తుది తీర్పు క్లాజ్-4 ద్వారా వీడబ్ల్యూడీటీ అనుమతి ఇచ్చింది. తుది తీర్పును అమలు చేస్తూ కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిన రోజు నుంచి ఏడాదిలోగా నేరడి బ్యారేజీలో ముంపునకు గురయ్యే 106 ఎకరాల భూమిని ఒడిశా సర్కార్ సేకరించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి అప్పగించాలని క్లాజ్-8 ద్వారా వీడబ్ల్యూడీటీ ఆదేశించింది. గెజిట్ నోటిఫికేషన్ జారీ అయిన రోజు నుంచి మూడు నెలల్లోగా తీర్పు అమలును పర్యవేక్షించడానికి ఆంధ్రప్రదేశ్, ఒడిశా ప్రభుత్వాలు నామినేట్ చేసిన వారితోపాటు నలుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి క్లాజ్-10 ద్వారా వీడబ్ల్యూడీటీ దిశానిర్దేశం చేసింది. పర్యవేక్షణ కమిటీ నిర్ణయాలు, మార్గదర్శకాలపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే పరిష్కరించడానికి సింగిల్ మెంబర్ రివ్యూ అథారిటీని ఏర్పాటు చేయాలని క్లాజ్-10(ఏ) ద్వారా కేంద్రాన్ని వీడబ్ల్యూడీటీ ఆదేశించింది. రివ్యూ అథారిటీగా కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి వ్యవహరిస్తారు. రివ్యూ అథారిటీ నిర్ణయానికి రెండు రాష్ట్రాలు కట్టుబడాలి.


**శ్రీకాకుళం రైతులకు ఫలాలను అందించాలి..**

వీడబ్ల్యూడీటీ తీర్పు వెలువడి నాలుగేళ్లు పూర్తయింది. తుది తీర్పు కూడా వచ్చింది. కానీ ఇప్పటిదాకా వీడబ్ల్యూడీటీ తీర్పును అమలు [తరువాయి 2లో..

## ఉత్తమ పర్యాటక ప్రదేశంగా విశాఖ

- పర్యాటక రంగంలో రాష్ట్రానికి రెండు జాతీయ అవార్డులు
- తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ముమ్మర చర్యలు
- క్యాన్సర్ చికిత్స కోసం అత్యాధునిక ఆసుపత్రులు
- వ్యాక్సినేషన్ ద్వారా పిల్లలకు తప్పనున్న కోవిడ్ ముప్పు
- ఆక్వాహబ్ లు, రిటైల్ దుఖానాల ద్వారా 40 వేల మందికి ప్రత్యక్ష ఉపాధి, లక్ష మందికి పరోక్ష లబ్ధి

**ట్విట్టర్ వేదికగా ఎంపీ (రాజ్యసభ ) విజయసాయి రెడ్డి**



విశాఖపట్నం : పర్యాటక రంగంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రెండు జాతీయ అవార్డులు సొంతం చేసుకుందని, టూరిజం ట్రావెల్ అసోసియోషన్ ప్రకటించిన ఈ అవార్డుల్లో ఉత్తమ పర్యాటక పాలసీగా, ఏపి టూరిజం పాలసీ, ఉత్తమ పర్యాటక ప్రదేశంగా విశాఖ పట్నం అవార్డులు సొంతం చేసుకున్నాయని రాజ్యసభ సభ్యులు, వైకాపా జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయి రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ట్విట్టర్ వేదికగా పలు అంశాలు వెల్లడించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సారధ్యంలో రాష్ట్ర పర్యటక రంగం ప్రపంచ దేశాలతో పోటీపడుతుందని అన్నారు. విశాఖపట్నంతో పాటు రాష్ట్రంలోని పలు తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో రక్షణ మరియు పునరుద్ధరణ చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయని. విద్యుత్ మరియు అత్యవసర సేవల పునరుద్ధరణ పనులు నిరాటంకంగా కొనసాగుతున్నాయని అన్నారు.

ముఖ్యమంత్రి ఆదేశానుసారం భాదితులకు తక్షణ సహాయం అందుతుందని అన్నారు. క్యాన్సర్ భారిన పడిన వారికి చికిత్స అందించేందుకు కుటుంబ సభ్యులు ఆర్థిక పరమైన ఇబ్బందులు ఎదుర్కోంటున్నారని, అటువంటి పరిస్థితిని దూరం చేసేందుకు రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లో అత్యాధునిక ఆసుపత్రులు నెలకొల్పాలని ముఖ్యమంత్రి సంకల్పించారని విజయసాయి రెడ్డి పేర్కొన్నారు. వివిధ మెడికల్ కాలేజీలు, జిల్లా ఆసుపత్రుల్లో క్యాన్సర్ చికిత్సలను నిర్వహించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారని అన్నారు. అత్యాధునిక క్యాన్సర్ చికిత్స అందరికీ [తరువాయి 2లో..

## ఏపీలో కొత్తగా 1,084 కరోనా కేసులు

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో కరోనా కేసులు క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయి. గడిచిన 24 గంటల్లో ఏపీలో 57,345 మందికి కరోనా పరీక్షలు నిర్వహించగా 1,084 మందికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. 24 గంటల్లో కరోనా బారిన పడి 13 మంది మృత్యువాతపడ్డారు. దీంతో మొత్తం మరణాల సంఖ్య 14,163 కు చేరింది. ఒకరోజులో 1,328 మంది కోవిడ్ నుంచి కోలుకుని క్షేమంగా డిశ్చార్జ్ అవ్వగా, ఇప్పటివరకు 19,89,391 మంది ఏపీలో డిశ్చార్జ్ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ బుధవారం కరోనాపై హెల్త్ బులెటిన్ విడుదల చేసింది. ప్రస్తుతం 11,655 కరోనా కేసులు యాక్టివ్‌గా ఉన్నాయి. దీంతో రాష్ట్రంలో పాజిటివ్ కేసుల సంఖ్య 20,49,314కు చేరింది. ఏపీలో ఇప్పటివరకు 2,81,78,305 కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఇప్పటివరకు రాష్ట్రంలో 20,23,496 మంది కరోనా నుంచి కోలుకున్నారు.

## పవన్ తీరుపై చిరంజీవి విచారం వ్యక్తం చేశారు




మచిలీపట్నం: చిత్ర పరిశ్రమలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, అందుకు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు చొరవ చూపాలని పలువురు సినీ ప్రముఖులు విజ్ఞప్తి చేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు సినీ ప్రముఖులు దిల్ రాజు, డి.వి.వి.దానయ్య, బన్నీ వాసు, సునీల్ నారంగ్ తదితరులు కృష్ణా జిల్లా మచిలీపట్నంలో ఏపీ సినిమాటోగ్రఫీశాఖ మంత్రి పేర్నినానితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పేర్నినాని మాట్లాడుతూ.. సినీపరిశ్రమకు నష్టం జరిగే సంఘటనలు ఉత్పన్నమవుతున్నందునే [తరువాయి 2లో..

## అక్టోబరు 2వ తేదిన ‘జగనన్న స్వచ్ఛ సంకల్పం క్లీన్ ఆంధ్రప్రదేశ్’

**రాష్ట్ర పంచాయితీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి**






విశాఖపట్నం : అక్టోబరు 2వ తేదిన ‘జగనన్న స్వచ్ఛ సంకల్పం క్లీన్ ఆంధ్రప్రదేశ్’ కార్యక్రమం, 7వ తేదిన “వై.ఎస్.ఆర్. ఆసరా” పథకాలను రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి ప్రారంభించనున్న నేపథ్యంలో బుధవారం రాష్ట్ర పంచాయితీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమాన్ని రాష్ట్ర స్థాయిలో అక్టోబరు 2న ప్రారంభిస్తారని, జిల్లా స్థాయిలో జిల్లా మంత్రులు, ఇన్ చార్జీ మంత్రులు, నియోజక వర్గాలలో శాసన సభ్యులు మండలాలు, గ్రామాలలో ప్రజా ప్రతినిధులు కార్యక్రమాలకు తప్పని సరిగా హాజరవ్వాల్సి ఉంటుందన్నారు. 100 రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమం ద్వారా మన ఇళ్లను [తరువాయి 2లో..

## అన్ని శాఖల సమన్వయంతో రహదారి ప్రమాదాలను తగ్గించాలి

**- ఎంపీ ఎం.వి.వి.సత్యనారాయణ**



విశాఖపట్నం : అన్ని శాఖల సమన్వయంతో రహదారి ప్రమాదాలను తగ్గించాలని జిల్లా రహదారి భద్రత కమిటీ, చైర్మెన్ మరియు విశాఖ యం.పి శ్రీ యం.వి.వి.సత్యనారాయణ తెలియజేశారు. బుధవారం కలెక్టర్ కాన్ఫెరెన్స్ హాలులో జిల్లా రహదారి భద్రత సమావేశము జరిగింది. ఈ సందర్భంగా యం.పి.యం.వి.వి సత్యనారాయణ గారు మాట్లాడుతూ జిల్లాలో రహదారి ప్రమాదములను తగ్గించాలని, పోలీసు మరియు రవాణా శాఖలు తనిఖీలను అధికంగా చేయాలని, అలాగే జి.వి.యం.సి. జాతీయ రహదారుల సంస్థ (NHAI), ఆర్ & బి, పంచాయితీ రాజ్ శాఖల అధికారులు సమావేశములో చర్చించిన రహదారి సంబంధిత పనులను వెంటనే చేపట్టాలని తెలియజేశారు. అలాగే నగరంలో ట్రాఫిక్ సిగ్నల్స్ ని సరిగా నిర్వహించాలని మరియు వాటిని టైమింగ్స్ సింక్రనైజ్ చేయాలని తెలియజేశారు.

నగరంలో ఉన్న బి.ఆర్.టి.ఎస్ రోడ్లు పనులను వెంటనే పూర్తీ చేయాలని, సెల్లర్లలో ఆక్రమణలను తొలిగించాలని, ఎన్.ఎచ్ మరియు సర్వీసు రోడ్లను విస్తరించాలని, ఎక్కడైతే భూమి అవసరమో అక్కడ ఆర్.డి.ఓ లతో మాట్లాడాలని, సీతకొండ దగ్గర ఉన్న రోడ్డు ను ఫారెస్టు శాఖ అధికారులతో మాట్లాడి విస్తరించాలని, విశాఖ నగరంలో రోడ్డు విస్తరణకు మరియు ప్రధాన కూడళ్ళ వద్ద 12 ఫ్లై ఓవర్ల నిర్మాణానికి ప్రభుత్వంనకు లేఖ రాశామని తెలియజేశారు. మేయర్, గొలగాని వెంకట హరి కుమారి గారు మాట్లాడుతూ మద్దిలపాలెం నుండి కృష్ణ కాలేజీ వరకు ఉన్న రోడ్లను విస్తరించాలని, అలాగే వెంకోజి పాలెం నుండి హనుమంతు వాక జంక్షన్ వరకు రోడ్లు విస్తరణ చేపట్టాలని తెలియ జేశారు. జె.సి. అరుణ్ బాబు (డెవలప్మెంట్) మాట్లాడతూ అనకాపల్లిలో జాతీయ

రహదారి ప్రక్కన ఉన్న పనులను వెంటనే చేపట్టాలని తెలియజేశారు. జె.సి. కల్పన కుమారి (హౌసింగ్ ) మాట్లాడతూ రహదారి విస్తరణలో భూములకు సంబంధించిన సమస్యలుంటే వెంటనే ప్రత్యేక డిప్యూటి కలెక్టర్, ఎన్.ఎచ్ ద్వారా తమ దృష్టికి తీసుకురావాలని తెలియజేశారు. డి.టి.సి.రాజ రత్నం గారు, మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ వాహనాన్నికి (HSRP) హై సెక్యురిటి నెంబర్ ప్లేట్లను మాత్రమే బిగించాలని తెలియజేశారు.



# ప్రజా సమస్యలు పరిష్కరానికి కృషి



ములగాడ : పారిశ్రామిక ప్రాంతం 62 వ వార్డు అచ్చెన్నాయుడు లోవ, ఎన్టీఆర్ నగర్, అల్లూరి సీతారామరాజు కాలనీ,తెలుగుదేశం కాలనీ, గుడివాడ అప్పన్న కాలనీ, దుర్గ నగర్ లను ఆనుకుని వస్తున్నటువంటి ప్రధాన కాలువ వలన స్థానికంగా ఉన్నటువంటి ప్రజలు గత రెండు సంవత్సరాలుగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గత రెండు రోజులుగా కురిసినటువంటి వర్షానికి కాలువ మొత్తం నిండిపోయి సుమారు 25 ఇల్లు ముప్పుకు గురయ్యాయి. కోస్ట్ గార్డు సంబంధించినటువంటి రక్షణ గోడ కూలిపోవడం జరిగింది. విషయం తెలుసుకున్న పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు గణబాబు మంగళవారం సంఘటన స్థలానికి చేరుకొని ముప్పుకు గురైన ప్రాంతాన్ని పరిశీలించడం జరిగింది. బుధవారం కోస్ట్ గార్డ్ అధికారులతో కమాండెంట్ శత్రుజీత్ సింగ్, సాహిత్ ఎస్ కమాండెంట్ (JG), సివిల్ ఇంజనీర్ సిబ్బందితో కలిసి శాశ్వత పరిష్కారం కొరకు చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు మజ్జి మాలి నాయుడు , నాయకులు జోజి బాబు, నీలం రాజు, డొప్ప సన్యాసిరావు, రాము, రామారావు, మురళి తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద పాస్టర్ లకు నిత్యావసర సరుకులు అందజేత



గాజువాక : బిక్కవోలు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుపేదల పాస్టర్లకు నిత్యవసర వస్తువులు, మెడికల్ కిట్లు గాజువాక వైఎస్సార్సీపీ ఇంచార్జీ తిప్పల దేవన్ రెడ్డి గారి చేతుల మీదుగా బుధవారం పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో 66వ వార్డ్ కార్పొరేటర్ మొహమ్మద్ ఇమ్రాన్, 64వ వార్డ్ వైఎస్సార్సీపీ ఇంచార్జీ ధర్మాల శ్రీను, 72వ వార్డ్ వైఎస్సార్సీపీ ఇంచార్జ్, ఏర్పోట్ అథారిటీ డైరెక్టర్ సిరట్లా వాసు, ట్రస్ట్ చైర్మన్, ట్రస్ట్ సభ్యులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన కె.కె రాజు



సీతమ్మధార : విశాఖ ఉత్తర నియోజకవర్గం 14వ వార్డు రాధకృష్ణా లే ఔట్ లో జీవీఎంసీ ప్రాజెక్ట్ డైరెక్టర్ యాదగిరి శ్రీనివాస్, 14వార్డు కార్పొరేటర్ కె.అనిల్ కుమార్ రాజు తో కలిసి విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త,రాష్ట్ర నెడ్ క్యాప్ చైర్మన్ కె.కె రాజు పర్యటించారు. గులాబ్ తుఫాన్ కారణంగా ఇల్లల్లో వర్షపు నీరు రావడం,కమ్మల పాకలు పడిపోవడం జరిగింది.

మలేరియా డెంగీ వంటి జ్వరాలు విజృం భించ కుండా తగిన జాగ్రత్తలు పాటించాలని, వారంలో రెండు రోజుల పాటు డ్రైడే పాటించాలని అవగాహన కల్పించారు.మీకు ఎటువంటి ఇబ్బంది కలిగినా తెలియజేయాలని 24 గంటలు అధికారులు, మేము మీకు అందుబాటులో ఉంటామని ఎవరు అభద్రతా భావానికి లోనుకావద్దని, మేమంతా మీకు అండగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏ.ఈ రహిమ్,సీడిఓ పద్మావతి, సీ ఓ భాస్కర్, ధనరాజ్, రమణ, సచివాలయం సిబ్బంది, వాలంటరి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన నగర మేయర్



విశాఖపట్నం : మహా విశాఖపట్నం నగరపాలక సంస్థలో 2వ జోన్ 13వ వార్డు పరిధిలోని ఆరిలోవలో బుధవారం మెడికవర్ మరియు మౌనశ్రీ ఫౌండేషన్ వారు సంయుక్తంగా నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరానికి నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి ముఖ్య అతిథిగా వార్డు కార్పొరేటర్ సునీత సత్యనారాయణతో కలిసి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ ఆరిలోవ పరిసర ప్రాంతాలలో అధికంగా పేదవారు నివసిస్తున్నారని, వారికి మెగా ఉచిత వైద్య శిబిరం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. బి.పి., షుగరు, ఈ.సి.జి. లాంటి దాదాపు 60 రకాల వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నారని, దీనిని వార్డు ప్రజలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య శిబిరం ఏర్పాటు చేసినందుకు మౌనశ్రీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు శీలం సురేఖను, మెడికవర్ హాస్పిటల్ యాజమాన్యాన్ని అభినందించారు. ఇటువంటి మెగా వైద్య శిబిరాలను అన్ని వార్డులలో నిర్వహించాలని మేయర్ వారిని కోరారు.

## దాడులను ఖండిస్తూ లేఖాస్త్రాలు సంధించిన తమ్ముళ్లు



మధురవాడ : రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే ప్రతిపక్ష నేత మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇంటి పై దాడులు చేస్తున్నారని భీమిలి నియోజకవర్గ తెలుగు తమ్ముళ్ళు మండిపడ్డారు. ఈ మేరకు భీమిలి నియోజకవర్గ పరిధినుండి వారం రోజులుగా 68 గ్రామ కమిటీలు, మూడు మండలాలు మరియు జీవీఎంసీ కి సంబంధించిన తొమ్మిది వార్డులలో గల టిడిపి కార్యకర్తలు నుంచి సేకరించిన సంతకాలను ఉత్తరాల ద్వారా మధురవాడ తపాలా కేంద్రం నుండి బుధవారం రాష్ట్రపతికి, ప్రధానమంత్రికి, ఆంధ్ర రాష్ట్ర గవర్నర్ కు కోరాడ రాజబాబు ఆధ్వర్యంలో పంపించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రకరకాల వడ్డీలతో ప్రజలపై అధిక భారం మోపుతోందని, అలాగే రాష్ట్రంలో అర్హులైన చాలా మందికి పెన్షన్ తొలగించారని అంతేకాక అనేక ప్రజా సమస్యలపై స్పందించిన చంద్రబాబు పై ఉద్దేశపూర్వకంగానే దాడులు చేయిస్తున్నారని, ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే వారిని ముందస్తు అరెస్ట్ తో భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ధ్వజమెత్తారు, రాష్ట్రంలో పాలన కుంటుపడిందని తక్షణమే కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ సంతకాలు సేకరించిన ఉత్తరాలను నేరుగా పంపిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో 5,6,7,8 వార్డుల అధ్యక్షులు దాసరి శ్రీనివాస్, సత్యనారాయణ, మోళ్లు లక్ష్మణరావు, పిళ్ళా వెంకట్రావు, ఆనంద్ బాబు, వాండ్రాసి అప్పలరాజు, పిళ్ళా నరసింగరావు, పాతిన ఎల్లంనాయుడు, సూర్య ప్రకాష్, గోలగాని సన్యాసిరావు, బోయి రమాదేవి కార్యకర్తలు తదితరులు పాల్గున్నారు.



మొదటి పేజీ తరువాయి

## ఉత్తమ పర్యాటక ప్రదేశంగా విశాఖ

అందుబాటులోకి తేవాలని, చికిత్స కోసం ఇతర రాష్ట్రాలకు వెల్లాల్సిన అవసరం లేకుండా రాష్ట్రంలో మెరుగైన చికిత్స అందించాలన్నదే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి లక్ష్యమని అన్నారు. పిల్లలపై కోవిడ్ వ్యాక్సినేషన్ ట్రయల్స్ కు కేంద్ర ప్రభుత్వం సీరం ఇన్ స్టిట్యూట్ ను అనుమతించడం శుభపరిణామమని ఈ మేరకు 12 నుండి 17 సంవత్సరాల మద్య వయస్సుగల పిల్లలకు వ్యాక్సిన్లు ఇవ్వడానికి 2 సంస్థలకు ఇప్పటికే అనుమతి దక్కిందని అన్నారు. పిల్లలకు త్వరగా వ్యాక్సిన్లు వేయడం ద్వారా కోవిడ్ ముప్పు తప్పుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నెలకొల్పనున్న ఆక్వాహబ్ లు , రిటైల్ దుఖానాలు ద్వారా 40 వేల మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభిస్తుందిని, పరోక్షంగా లక్ష మందికి లబ్ది చేకూరుతుందని అన్నారు. గ్రామాల్లో సహకార రంగం తిరిగి బలోపేతం కావాలన్నదే ముఖ్యమంత్రి అభిమతమని, రైతులకు మహిళలకు మరింత మేలు జరిగేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ సాయం పొందడం ఎయిడెడ్ విద్యాసంస్థల హక్కేమీ కాదని ఉత్తరప్రదేశ్ కేసులో సుప్రీం ధర్మాసనం స్పష్టం చేయడాన్నితాము మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తున్నామని అన్నారు. సహేతుక కారణాలతో ఎయిడెడ్ కు నిధులు నిలిపివేస్తూ విదాన నిర్ణయం తీసుకుంటే తప్పుపట్టలేమని తీర్పులో సుప్రీం స్పష్టం చేసిందని పేర్కొన్నారు. కేంద్ర మంత్రి, ఆస్సాం మాజీ ముఖ్య మంత్రి సర్బానంద సోనోవాల్ ఎకగ్రీవంగా రాజ్యసభకు ఎన్నిక కావడంపై ఆయనకు ట్విట్టర్ ద్వారా శుభాభినందనలు తెలియజేసారు. అతని జ్ఞానసంపద, పరిపాలనా అనుభవం రాజ్యసభలో జరగబోయే చర్చలకు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే, వైఎస్ ఆర్ సిపి నాయకుడు, రాయలసీమ హక్కుల కోసం కృషి చేసిన పోరాట యోధుడు డాక్టర్ ఎం వి రమణా రెడ్డి గారి మృతి భాధాకరమని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగతంతుడిని ప్రార్దిస్తున్నారని ట్విట్టర్ లో పేర్కొన్నారు. లక్షల సంఖ్యలోని ప్రజలు గుండె జబ్బులతో బాధపడుతున్నారని అయితే వీరిలో చాలామంది తాము గుండె జబ్బుతో భాదపడుతున్నట్లు వారికే తెలియకపోవడం బాధాకరమని అన్నారు. గుండె జబ్బులపై ప్రజలలో పెద్ద ఎత్తున చైతన్యం తీసుకురావాలల్సిన అవసరం ఎంతైనా ఉందని, వ్యాయామము మరియు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు ద్వారా గుండె జబ్బులు దూరం చేసుకోవచ్చని ఈ మేరకు ప్రజలు చైతన్యవంతులు కావాలని పిలుపునిచ్చారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా విజయసాయి రెడ్డి ట్వీట్ చేసారు.

## 'వంశధార'పై తుది తీర్పు అమలు చేయండి

చేస్తూ కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయలేదు. అత్యంత వెనుకబడిన శ్రీకాకుళం జిల్లా రైతులకు నేరడి బ్యారేజీ ఫలాలను అందజేయడానికి వీలుగా తక్షణమే సెక్షన్-6(1) ప్రకారం వీడబ్ల్యూడీటీ తుది తీర్పును నోటిఫై చేస్తూ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయాలని కోరుతున్నాం. తుది తీర్పు అమలు తీరును పరిశీలించేందుకు పర్యవేక్షణ కమిటీ, సింగిల్ మెంబర్ రివ్యూ అథారిటీని కూడా నియమించాలి.

## అక్టోబరు 2వ తేదిన "జగనన్న స్వచ్ఛ సంకల్పం క్లీన్ ఆంధ్రప్రదేశ్"

ఏ విధంగా శుభ్రంగా చేసుకుంటాము అదే విధంగా మన గ్రామాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకునే విదంగా ప్రజలకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఒక్కరూ దృష్టి పెట్టి విజయవంతం చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అవసరమైన మెషినరి, ఇన్ ఫ్రాస్ట్రక్చర్ సిద్దంగా ఉందన్నారు. రాష్ట్ర మరియు జిల్లా స్థాయిలో కమాండ్ కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేయాలన్నారు. అక్టోబరు 7వ తేదిన వై.ఎస్.ఆర్. ఆసరా పథకం రెండవ విడత ప్రారంభించడం జరుగుతుందని రాష్ట్ర వ్యాప్తంగా 10 రోజుల పాటు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. రాష్ట్ర స్థాయిలో 7వ తేదిన ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని, 8వ తేదిన జిల్లాలలో మంత్రులు, నియోజక వర్గాలలో శాసన సభ్యులు ప్రారంభించే కార్యక్రమంలో జెడ్.పి.టి.సి, ఎం .పి.టి.సి., ఎం .పి.టి, సర్పంచ్ లు తప్పని సరిగా పాల్గొని ప్రజలలో రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. జాయింట్ కలెక్టర్ పి.అరుణ్ బాబు మాట్లాడుతూ జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లను సిద్దం చేస్తున్నామని, జిల్లాలో 100 రోజుల పాటు నిర్వహించే కార్యక్రమానికి కార్యచరణ ప్రణాళికను తయారు చేస్తున్నా మన్నారు. ప్రత్యేక కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. స్వచ్ఛ సంకల్పానికి సంబందించి జిల్లాకు 29 గార్బేజి అటోలు రానున్నాయని చెప్పారు. అదే విదంగా వై.ఎస్.ఆర్. అసరా పథకానికి సంబందించి జిల్లా వ్యాప్తంగా 63,991 స్వయం సహాయక గ్రూపులకు రూ 470 కోట్లను పంపిణీ చేయనున్నామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ లో జెడ్.పి.సి.ఇ.ఓ నాగార్జున సాగర్, డి .ఆర్. డి.ఎ, డ్వామా పి.డిలు విశ్వేశ్వరరావు, సంధీప్, డి .పి.ఓ. కృష్ణకుమారి తదితరులు హాజరైయారు.

## పవన్ తీరుపై చిరంజీవి విచారం వ్యక్తం చేశారు

నిర్మాతలు తనతో సమావేశమయ్యారని తెలిపారు. సినిమా పరిశ్రమను బతికించేందుకు ప్రభుత్వం ఇచ్చే సూచనలు, సలహాలు పాటించేందుకు సిద్ధమని చెప్పారని తెలిపారు. 'ఆన్‌లైన్ టికెటింగ్ విధానంపై సినీ పరిశ్రమ సానుకూలంగా ఉంది. సినీ పరిశ్రమ ఏకతాటిపై ఉన్నట్టు సీఎంతో చెప్పాలని కోరారు. ఆన్‌లైన్ టికెట్లపై అనుకూలమని నిర్మాతలు చెప్పారు. ఇప్పటికే పోర్టళ్లు, ఆన్‌లైన్‌లో టికెట్ల అమ్మకం జరుగుతోంది. కొన్ని చోట్ల 90శాతం టికెట్లు ఆన్‌లైన్‌లో అమ్ముతున్నారు. సినీ పరిశ్రమకు నష్టం జరిగే ఘటనలు ఉత్పన్నమవుతున్నట్టు చెప్పారు. ప్రభుత్వం నిర్వహించిన గత భేటీపై అందరూ సంతృప్తిగా ఉన్నారు. పవన్ కల్యాణ్ వ్యాఖ్యలకు, సినీ పరిశ్రమకు సంబంధం లేదని నిర్మాతలు చెప్పారు. పవన్ వ్యాఖ్యలతో బాధపడినట్టు నిర్మాతలు తెలిపారు. చిరంజీవి కూడా నాతో మాట్లాడారు. 'రిపబ్లిక్' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో పవన్ కల్యాణ్ మాట్లాడిన తీరుపై ఆయన విచారం వ్యక్తం చేశారు. పవన్ వ్యాఖ్యలతో చిత్ర పరిశ్రమకి సంబంధం లేదని చెప్పారు' అని పేర్ని నాని తెలిపారు. నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ.. 'చిత్ర పరిశ్రమను వివాదాల్లోకి లాగొద్దు. సినిమా టికెట్ల రేట్లు పెంచమని మేమే కోరాం. దాని గురించి గత సమావేశంలో చర్చించాం. చిరంజీవి, నాగార్జున, రాజమౌళితో కలిసి గతంలోనే సీఎంను కలిశాం. పరిశ్రమపై కొవిడ్ ప్రభావం..సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లాం. దయచేసి అందరూ వివాదాలకు మమ్మల్ని దూరంగా ఉంచండి. గతంలో మా విజ్ఞప్తిపై ఏపీ ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. ఆన్‌లైన్ విధానం కావాలని పరిశ్రమ తరపున మేమే ప్రభుత్వాన్ని కోరాం. ఆన్‌లైన్ విధానం పారదర్శకంగా ఉంటుంది. మంత్రి నాని సానుకూలంగా స్పందించారు. దాన్ని పూర్తి స్థాయిలో సినీ పరిశ్రమకి వివరించలేకపోయాం. అందుకే ఇలాంటి పరిస్థితి ఎదురైంది. అనుకోని పరిణామాలు జరుగుతున్నాయి' అని పేర్కొన్నారు.

**పవన్ కల్యాణ్ వ్యాఖ్యలకి మంత్రి కౌంటర్**

మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో జనసేన విస్తృతస్థాయి సమావేశంలో పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై పేర్ని నాని స్పందించారు. భారతదేశంలో తొలిసారి కిరాయి రాజకీయ పార్టీ పెట్టిన వ్యక్తి పవన్ కల్యాణ్ అని ఏపీ మంత్రి పేర్ని నాని విమర్శించారు. "రాజకీయ పార్టీలకు టెంట్ హౌస్ పెట్టిన వ్యక్తి పవన్. నేను బూతులు తిట్టలేదు కాబట్టే టీవీలో నా ప్రెస్ మీట్ ప్రసారం చేశారు. నన్ను అవమానించాలని చూస్తే.. ఆ అవమానాన్ని పరిచయం చేస్తా" అని పేర్ని నాని హెచ్చరించారు.

# గుండె ఆరోగ్యం పదిలంగా ఉండాలి

శ్రీకాకుళం : గుండె ఆరోగ్యం పదిలంగా ఉండాలని జాయింట్ కలెక్టర్ డా. కె.శ్రీనివాసులు అన్నారు. జెమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో బుధ వారం జరిగిన ప్రపంచ హృదయ దినోత్సవం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా శ్రీనివాసులు పాల్గొన్నారు. ఏడు రోడ్ల కూడలి వద్ద శోభా యాత్ర అనంతరం బాపూజీ కళా మందిర్ లో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలన్నారు. ఆరోగ్య పరిస్థితులపై అవగాహన పెంచుకోవాలని ఆయన సూచించారు. కోవిడ్ సమయంలో ఆరోగ్య సంరక్షణకు మరింత ఆవశ్యకత ఏర్పడిందన్నారు. కోవిడ్ అనుభవం రీత్యా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని ఆయన పేర్కొన్నారు. కోవిడ్ భారీన పడిన అనంతరం ఆరోగ్య పరిస్థితి గమనించాలని అన్నారు. ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా పరీక్షలు చేసుకోవాలని సూచించారు.

కోవిడ్ అనంతరం హృదయ సంభందిత సమస్యల పట్ల దృష్టి సారించాలని నిపుణులు సూచిస్తున్న విషయాన్ని గమనించాలని ఆయన చెప్పారు. కోవిడ్ నియమ నిబంధనలు పాటించాలని, మాస్కులు ధరించాలని, భౌతిక దూరం పాటించాలని, తరచూ చేతులు శుభ్రం చేసుకోవాలని కోరారు. కోవిడ్ వాక్సినేషన్ జిల్లాలో పెద్ద ఎత్తున చేపడుతున్నామని, అందరూ వాక్సినేషన్ వేయించు కోవాలని పిలుపు నిచ్చారు. వాక్సినేషన్ తోనే కోవిడ్ కు దూరంగా ఉండగలమని గమనించాలని ఆయన తెలిపారు.

## మాజీ ఎమ్మెల్యే ఎం.విరమణారెడ్డి మృతికి సంతాపం



వైఎస్సార్ జిల్లా: పొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ఎం.వీ. రమణారెడ్డి ఆకస్మిక మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. రమణారెడ్డి కుటుంబసభ్యులకు సీఎం జగన్ ప్రగాఢ సానుభూతి తెలిపారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నరమణారెడ్డి బుధవారం కర్నూలులోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచిన విషయం తెలిసిందే. ఆయన మృతిపట్ల పలువురు రాజకీయ నేతలు తమ సంతాపాన్ని తెలియజేశారు.

# పర్యాటకం ద్వారా ఆదాయం

### - సహాయ సంచాలకులు లోచర్ల రమేష్

శ్రీకాకుళం : పర్యాటకం ద్వారా ఆదాయం వస్తుందని సహాయ సంచాలకులు లోచర్ల రమేష్ వెల్లడించారు. బుధవారం మహిళా కళాశాల సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రపంచ పర్యాటక దినోత్సవం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గులాబ్ తుఫాను కారణంగా ప్రపంచ పర్యాటక దినోత్సవం జరుపుకోలేక పోయామన్నారు. పర్యాటకం వలన ఆదాయం వస్తుందని, విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఎంచుకోవాలని చెప్పారు. విద్యార్థులు తరచుగా పేపర్ చదివి జ్ఞానాభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కలలు కని శ్రమించి విజయాన్ని అందుకోవాలని విధ్యార్థులకు బోదించారు. ప్రణాళికా ప్రకారం చదువుకుంటే లక్ష్యాన్ని చేరుకోగలమని చెప్పారు. ఈ యేడాది పర్యాటక దినోత్సవ థీమ్ సమగ్రాభివృద్ధికి పర్యాటకం అని చెప్పారు. పర్యాటకం పై వివరించారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం థీమ్ సమగ్రాభివృద్ధికి పర్యాటకం పై విద్యార్థిని సుకన్య వివరించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఎస్డిఓ శ్రీనివాసరావు, ఇంటాక్ జిల్లా అధ్యక్షులు రాధా ప్రసాద్, ప్రిన్సిపాల్ సత్యనారాయణ, స్వామి, కో ఆర్డినేటర్ స్వామి, ఇంటాక్ సభ్యులు మోహనరావు, పర్యాటక అధికారి నారాయణ రావు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## రాయపు రాజుపేట లో కొట్టుకుపోయిన

# కాజ్ వే ను సందర్శించిన టీడీపీ నేతలు

- ఎర్రి గడ్డ పై వంతెన నిర్మాణం ప్రభుత్వం తక్షణం చేపట్టాలి
- మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు



ఎర్రగడ్డ పై కొట్టుకుపోయిన కాజ్వే పరిశీలిస్తున్న టీడీపీ నేతలు

చోడవరం : మండలంలోని రాయపురాజుపేట గ్రామంలో గులాబ్ తుఫాన్ వర్షం ధాటికి కొట్టుకుపోయిన ఎర్రి గడ్డ తాత్కాలిక కాజ్వే టిడిపి నాయకులు అనకాపల్లి మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే కె ఎస్ ఎ ఎస్ ఎ రాజు, చోడవరం నియోజక వర్గ ఇన్చార్జి బత్తుల తాతయ్య బాబు, రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షులు గూనురు మల్లు నాయుడు, టిడిపి మండల పార్టీ బొడ్డేడ నాగ గంగాధర్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ నాగ జగదీశ్వర రావు, మాజీ ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ కాజ్వే కొట్టుకుపోయి రాకపోకలు పూర్తిగా నిలిచిపోవడంతో పరిసర గ్రామాల ప్రజలు, స్థానిక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిల్లా కలెక్టర్, ప్రభుత్వం తక్షణమే స్పందించి ఎర్రి గడ్డ పై వంతెన నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాయపు రాజుపేట సర్పంచు బొడ్డేడ రామునాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# రాష్ట్ర టి.ఎన్.ఎస్.ఎఫ్ కమిటీ సభ్యులకు ఘన సత్కారం





నర్సీపట్నం : తెలుగుదేశం పార్టీ అనుబంధ విభాగం తెలుగునాడు విద్యార్థి సమైక్య ఇటీవల విడుదల చేసిన రాష్ట్ర కమిటీలో విశాఖపట్నం పార్లమెంట్ తరుపున ఎన్నికైన నాయ కులను ఆ సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నూతనంగా ఎంపికైన రాష్ట్ర టిఎన్ఎస్ఎఫ్ ఉపాధ్యక్షులు ఎర్రంశెట్టి కార్తీక్ మరియు రాష్ట్ర అధికార ప్రతినిధి లెంక సురేష్ లను శాలువా, పూలదండ లతో సత్కరించి, అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎస్ రాతన్ కాంత్ ప్రధాన కార్యదర్శి జోషి యాదవ్ , ఉపాధ్యక్షుడు అవినాష్ అధికార ప్రతినిధి ప్రవీణ్, కార్యనిర్వహణ కార్యదర్శి బోని సురేష్, గాజువాక నియోజకవర్గ అధ్యక్షుడు బోండా రవి, దుర్గా ప్రసాద్, అస్లాం, రాజిక్ తదితరులు పాల్గొన్నారు

# గ్రామాల్లో పారిశుధ్య పనులపై దృష్టి పెట్టాలి



డ్రైనేజీలను పరిశీలిస్తున్న ఎంపిడిఒ

కొయ్యూరు : గులాబ్ తుఫాను కారణంగా గ్రామాల్లో పారిశుధ్య సమస్యలు, మంచినీటి వసతి సమస్యలు తలెత్తకుండా తగు ముందస్తు చర్యలు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపిడిఒఒ మేరీరోజ్ సిబ్బందికి సూచిం చారు. ఈ మేరకు రావణాపల్లి సచివాలయ సిబ్బందితో సమావేశం అనం తరం డ్రైనేజీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ తగినంత పారిశుధ్య సామాగ్రి అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అలాగే గ్రామాల్లో నీరు నిల్వ ఉన్న ప్రదేశాలను గుర్తించి నీరు నిల్వ లేకుండా చేయాలన్నారు. డ్రైన్‌ల యందు పూడికతీత పనులు చేసి చేపట్టి ఎక్కడ కూడా మురుగు సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. వాటర్ ట్యాంకులు క్లీనింగ్ చేయాలన్నారు. ప్రతిరోజు ట్యాంకుల యందు విధిగా క్లోరినేషన్ చేయాలన్నారు. తుఫాను కారణంగా ఎక్కడైనా ఆస్తి లేదా ప్రాణనష్టం జరిగిన వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. గ్రామాల్లో అంటు వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆమె వెంట ఈఒపిఆర్‌డి బాలదొర, పంచాయతీ సెక్రటరీ హైమావతి, వీఆర్వో, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# గులాబ్ ధాటికి విజినిగిరిపాలెంలో పంటలు ధ్వంసం



సింహాచలం: సింహాచలం పరిధి అడవివరం లండగరువు, విజినిగిరిపాలెం గ్రామాలలో గులాబ్ తుఫాన్ ఈదురుగాలుల భీబత్సానికి అరటి కర్ర పెండలం దుంపలు బొప్పాయి పంటలు నేలమట్టం అయ్యాయని సామాజిక కార్యకర్త విజిని గిరి బాలభానుమూర్తి అన్నారు. ఈ సందర్బంగా బాల బానుమూర్తి మాట్లాడుతూ దయచేసి ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి పంచ గ్రామాల భూ సమస్యతో ముడిపెట్టకుండా హుదూద్ తరహాలో పంట నష్ట పరిహారం ఇచ్చి అదుకున్నట్లుగా ఇప్పుడు కూడా పంట నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని అన్నారు.

## 'స్టాప్ ఇండియా స్పిట్టింగ్' పేరుతో

# అక్టోబర్ 2న విశాఖ లోని రోటరీ క్లబ్‌లు

అక్టోబర్ 2న విశాఖ లోని రోటరీ క్లబ్ లు 'స్టాప్ ఇండియా స్పిట్టింగ్' పేరిట కార్యక్రమాన్ని నిర్వహించనున్నాయని రోటరీ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డి. వరదా రెడ్డి ఓ ప్రకటన లో తెలిపారు. అక్టోబర్ 2న ఉదయం 11గంటలకు విశాఖ రైల్వే స్టేషన్, ద్వారకా బస్సు కాంప్లెక్స్, మద్దిలపాలెం బస్సు డిపో లలో ఈ కార్యక్రమం ప్రారంభం అవుతుందని ఆయన తెలిపారు.

ఉమ్మివేసే అలవాటు ను నివారించేందుకు వీలుగా చైతన్యపరిచే ఈ కార్యక్రమం లో పాల్గొదలచిన వారు రోటరీ ప్రతినిధులు హేమంత్ కుమార్, దొరబాబు, తమ్మయ్య గాంధీ, వర్మ రాథోడ్, అశోక్ మందాని, జి. కే. మూర్తి, పట్నాయక్, లలిత్ జైన్ లకు తెలియజేయాలని వరదారెడ్డి ప్రకటన లో కోరారు. ఉమ్మివేసే అలవాటు ను మానేసేలా ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు ఫ్లాష్మాబ్, కరపత్రాల పంపిణీ వంటివి చేపడుతున్నట్లు వివరించారు.

# అంతకాపల్లి లో ఉచితంగా మంచి నీరు సరఫరా చేసిన సర్పంచ్ నారాయణ మూర్తి



సబ్బవరం : మండలంలోని అంతకాపల్లి పంచాయతీ లో ఇటీవల గులాబ్ తుఫాన్ కారణంగా మంచి నీరు కలుషితం అవ్వడంతో మేగాద్రి రిజర్వాయర్ నుంచి వచ్చే వాటర్ 3 రోజుల నుంచి రావడం లేదు దీనికి ప్రత్యాంన్యాయంగా బుధవారం అంతకాపల్లి గ్రామ సర్పంచ్ సబ్బవరపు నారాయణ మూర్తి సొంత నిధులతో వాటర్ ట్యాంక్ తో అంతకాపల్లి గ్రామంలో పలు వీధులలో మంచి నీరు సరఫరా చేశారు ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ రవి, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రైతు సేవా యంత్ర పథకం కింద పవర్ టిల్లర్ మంజూరు





దేవరాపల్లి : రైతు సేవ యంత్ర పథకం ద్వారా రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని దేవరాపల్లి ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి భాస్కరరావు అన్నారు. మండల కేంద్రంలోని బంగారమ్మ తల్లి గ్రూప్ సభ్యులకు రైతు యంత్ర సేవ కేంద్రం ద్వారా మంజూరైన పవర్ టిల్లర్ బుధవారం ఎంపీపీ, సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సారథ్యంలో రైతు సంక్షేమమే లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి రైతుకు నేనున్నాను అని రైతు పక్షాన నిలబడిన ఏకైక ప్రభుత్వం వైసిపి ప్రభుత్వమే అన్నారు. అనంతరం మండల వ్యవసాయ అధికారి ఎమ్.వి.ఎస్. చలం మాట్లాడుతూ, ఇదే తరహాలో మండలంలోని మరో ఏడు గ్రూపులు పవర్ టిల్లర్ ల కోసం బ్యాంకులో డిపాజిట్ చేసి ఉన్నారని వారికి కూడా త్వరలోనే అందించడం జరుగుతుందన్నారు.


ఈ కార్య క్రమంలో...

రాష్ట్ర వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ వరదపురెడ్డి సింహాచలం నాయుడు, విఏఏ ఎస్.సత్యారావు, విఆర్‌వో నాగేశ్వరరావు, రైతులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వైకుంఠనారాయణ స్వామికి

# నిత్య ధూప దీప నైవేద్యాలు ప్రారంభం





సింహాచలం : వైకుంఠ మెట్ట పై శ్రీవరాహలక్ష్మీనృసింహస్వామి మూర్తిగా అవతరించిన వైకుంఠనారాయణ స్వామికి నిత్య ధూప దీప నైవేద్యాలు వైదికులు అర్చకులు బుధవారం నుండి ప్రారంభించారు. నాలుగురోజుల క్రితం ఈ వైకుంఠవాసుని మెట్టను ఈఓ సూర్యకళ సందర్శించి రోజూ దీపం వెలిగించాలని వస్త్రాలంకరణ చేయాలనీ ఆదేశించారు స్వామివైభవం భక్తులకు తెలిసేలా బోర్డులుకూడా పెడతామని ఈఓ సూర్యకళ తెలిపారు.

దీనితో ఏఈ ఓఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో...

అర్చకులు దేవస్థానం సిబ్బంది వెళ్లి స్వామివారికి పూజలు చేశారు.

# ఎంపిటిసి పదవికి రాజీనామా చేసిన సర్పంచ్



రాజీనామా లేఖను అందిస్తున్న దృశ్యం

మాకవరపాలెం : మాకవరపాలెం మండలం బోయినపాలెం ఎంపిటిసి పదవికి శెట్టిపాలెం సర్పంచ్ అల్లు రామునాయుడు రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా పత్రాన్ని బుధవారం జిల్లా పరిషత్ సిఇఒకు అందజేశారు. దీనిపై రాజీనామాను సిఇఒ ఆమోదించారు. ఎంపిటిసిగా నామినేషన్ వేసిన అనంతరం కోవిడ్ కారణంగా ఎన్నికలు వాయిదా వేసినట్లు ఆయన తెలిపారు. ఎన్నికలు రద్దు అవుతాయనే ఉద్దేశంతో సెట్టిపాలెం సర్పంచ్‌గా పోటీ చేసి విజయం సాధించినట్లు తెలిపారు. అయితే తర్వాత జరిగిన ఎంపిటిసి ఎన్నికల్లో కూడా గెలిచినట్లు ఆయన పేర్కొన్నారు. రాజ్యాంగం ప్రకారం ఒక వ్యక్తికి ఒకటే పదవి ఉండాలనే నిబంధనల మేరకు ఎంపిటిసి పదవికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.

## కేర్ ఆసుపత్రిలో ఘనంగా

# ప్రపంచ హృదయ దినోత్సవం

విశాఖపట్నం : ఆరోగ్యకరమైన ఆహారం, శరీరానికి అనువైన వ్యాయామం, దురవాట్లకు దూరంగా ఉండటం గుండె ఆరోగ్యంగా ఉండటానికి ఎంతగానో ఉపయోగపడతాయని ప్రఖ్యాత కార్డియాలజిస్టు డాక్టర్ పీవీవీఎన్ఎమ్ కుమార్ అన్నారు. బుధవారం విశాఖపట్నం రామనగర్‌లోని కేర్ ఆసుపత్రిలో ప్రపంచ హృదయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ప్రఖ్యాత కార్డియాలజిస్టులు డాక్టర్ జీఎస్ఆర్ మూర్తి, డాక్టర్ పీవీవీఎన్ఎమ్ కుమార్ మరియు కార్డియాక్ సర్జన్ డా.గిరిధర్ హరిప్రసాద్ లు కేక్ కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు కేర్ హాస్పిటల్ సీఓఓ విశ్వజీత్ కుమార్ మరియు హౌస్ కన్సల్టెంట్స్ సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ పీవీవీఎన్ఎమ్ కుమార్ మాట్లాడుతూ గుండె సంబంధిత వ్యాధులకు ప్రధాన కారణం ఒత్తిడి అని దానిని జయించినట్లయితే చాలా వరకు హృదయ సంబంధిత వ్యాధుల నుంచి బయటపడవచ్చున్నారు. 'కనెక్ట్ హార్ట్ టు కనెక్ట్' అనేది ఒకరి జ్ఞానం, ప్రభావం మరియు కరుణచూపడం ద్వారా తమ అప్తులతో ఆరోగ్యకరమైన జీవితాలను గడపడానికి ఉత్తమమైన అవకాశం ఉందన్నారు. ప్రజలు టెలి కన్సల్టేషన్ సదుపాయాన్ని ఉపయోగించుకోవాలని ఆయన కోరారు. కార్డియోపల్మోనరీ పునరుజ్జీవనం (సీపీఆర్) శిక్షణపై కూడా డాక్టర్ కుమార్ మాట్లాడారు.

డాక్టర్ జి.ఎస్ ఆర్. మూర్తి మాట్లాడుతూ చిన్న వయస్సులోనే ఆకస్మిక గుండెపోటుకు గల కారణాలపై ప్రసంగించారు క్లిష్ట పరిస్థితులలో తీసుకోవాల్సిన చర్యలను వివరించారు.కార్డియాక్ ఎమర్జెన్సీల సమయంలో సమగ్ర కార్డియాక్ ఆసుపత్రులను సంప్రదించాలని డాక్టర్ మూర్తి సూచించారు. ఆసుపత్రులలో నిపుణుల పర్యవేక్షణలో సుమారు 90%. అవకాశాలు ఉన్నాయన్నారు. యాంజియోప్లాస్టీ చేయడం ద్వారా రోగులను కాపాడవచ్చని తెలిపారు.

# విజయభాను సంపాదకీయం

## భాషా నైపుణ్యాలపైనే దృష్టి

ఈ మధ్య ఒక వీడియో వైరలయింది. అందులో ఆరేండ్ల వయస్సు పాప తన వయస్సు వారికి, ఇతర పాఠశాల విద్యార్థులకు ఆన్‌లైన్ పాఠాలు ఒకటి తరువాత ఒకటి సబ్జెక్టులు గుప్పిస్తుంటే ఎంత కష్టంగా ఉందో ప్రధాని నరేంద్ర మోదీని ఉద్దేశించి చక్కగా వివరించింది. నిజానికి ఆమె ముద్దు మాటల్లో మన విద్యావ్యవస్థలో ఉన్న లోపాలు, చేయవలసిన మార్పులు తెలుస్తున్నాయి.

భాష నేర్చుకోవటం, సాంకేతిక అంశాలు నేర్చుకోవటం కంటే భిన్నంగా ఉంటుంది. దానికి హృదయ స్పందన అవసరమవుతుంది. ఇది పాఠశాల స్థాయిలోనే ఎదుగుతున్న వయస్సు వారికి అబ్బుతుంది. 14 సంవత్సరాల తర్వాత భాషలు నేర్చుకోవటం కష్టమవుతుందని పరిశోధనలు నిరూపించాయి.

మన దేశం ఒకే భాషా సంస్కృతుల వ్యవస్థ కాదు. శతాబ్దాల తరబడి వివిధ రాజ్యాలుగా ఉండి, వివిధ భాషలు, సంస్కృతులు, విదేశీ దండయాత్రల ఫలితంగా వివిధ మతాలు ఏర్పడిన వైవిధ్యభరిత ఉపఖండం. ఇంగ్లీషు ద్వారా బోధన మొదలైన తరువాత 1947 దాకా రాజకీయ కారణాలతో ప్రాంతీయ భాషలను కొంతవరకు నిర్లక్ష్యం చేయటం జరిగింది. అయితే విద్య అందరికీ అందించటంలో విఫలమైన (స్వాతంత్ర్యానంతరం కూడా) ప్రభుత్వాల వల్ల ఈ భాషలకు మేలు జరిగి, ఇంకా వాడుక భాషలుగానే ఉన్నాయి. కానీ ఈ వైవిధ్యాన్ని అర్థం చేసుకోని విద్యావేత్తల వల్ల సమాజంలో చాలా ప్రతికూలతలు, వైరుధ్యాలు పెరిగాయి. భాషల ఔన్నత్యంపై అవగాహన ఉన్న విద్యావేత్తలు ఈ డబ్బై ఏండ్లుగా మొత్తుకుంటున్నా భాషా బోధన మెరుగుపడలేదు, భాషా విధానాన్ని సరిగా రూపొందించలేదు. ఈ వైఫల్యం వ్యాసం మొదట్లో చెప్పిన పాప వీడియోలో తేటతెల్లమైంది. నిజానికి కొవిడ్ మహమ్మారి చాలా విషయాల్లో మన కళ్ళు తెరిపించింది. ఈ ఏడాది కాలం ఆన్‌లైన్ టీచింగ్‌తో మనం పాఠశాల విద్యార్థులను ఎలా తీర్చిదిద్దగలిగి ఉండవచ్చో విశ్లేషిద్దాం!

మన దేశంలో ప్రతి విద్యార్థి ఎదుర్కొనే సమస్య భాషా నైపుణ్యాలు. ప్రపంచ భాష అయిన ఇంగ్లీషు తప్పనిసరిగా నేర్చుకోవలసినదే. దానికి తోడు దేశ భాష నేర్చుకోవాలి. అయితే దేశంలో చాలామందికి ఎందుకూ పనికిరాని హిందీని రాష్ట్ర భాషగా నిర్ణయించటం వల్ల విద్యావ్యవస్థ మీదే కాక చిన్నపిల్లల వ్యక్తిత్వ వికాసం మీద కూడా దెబ్బ పడింది. దాని బదులు సంస్కృతం, ఉర్దూ భాషలను రాష్ట్ర భాషలుగా గుర్తించి వాటిలో ఒకటి, ఇంగ్లిషు, మాతృభాషలను త్రిభాషా సూత్రంలో చేర్చి ఉంటే ఇంత గందరగోళ పరిస్థితి ఉండేది కాదు. ఎందుకంటే ఉర్దూ మాతృభాష అయినవారు మూడో భాషను ఎన్నుకోవచ్చు. అది పర్షియన్ గానీ, అరెబిక్ గానీ అవ్వచ్చు. ఇతర భారతీయ భాషలన్నీ సంస్కృతం నుంచి పుట్టినవే గనుక వారికీ సులభమయ్యేది. పైగా పాఠశాల స్థాయిలో సంస్కృతం నేర్చుకోవడం వల్ల ముఖ్యమైన లాభాలు రెండున్నాయి. ఒకటి సంస్కృత భాష నేర్పినప్పుడు కూడా పిల్లల వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడే అంశాలే ఉంటాయి.

ఉదాహరణకు పంచతంత్ర కథలలో నీతి, నిజాయితీ, త్యాగం, మంచితనం, ధైర్యం, సమాజ స్పృహ ఉంటాయి. మోసం, అసత్య ప్రవర్తన, చెడు మొదలైన వాటిని ఎట్లా రూపుమాపాలి వంటి అంశాలు ఉంటాయి. వీటిని చదువడం వల్ల పిల్లల వ్యక్తిత్వం అలవోకగా ఎదుగుతుంది. మంచీ-చెడూ, ధర్మం-అధర్మం, నీతి-అవినీతి మధ్యనున్న వ్యత్యాసం అర్థం చేసుకోవటమే కాక మంచి వ్యక్తులుగా వారిని రూపుదిద్దుకునేట్టు చేస్తాయి ఈ కథలు. ఇంకా సుభాషితాలు ఒక్కో పద్యం ఒక్కో రత్నం. అయితే వీటిని పాఠశాల స్థాయిలో చెప్పాలంటే భాషా నైపుణ్యాల బోధన మీద కూడా దృష్టి ఉండాలి. ఇది జరిగితే పిల్లలు తమ సంస్కృతిని అవగాహన చేసుకుంటారు. ఇంగ్లీష్ మీడియంలోనే చదువుకున్న తమిళ, మలయాళ విద్యార్థులకు, తెలుగు విద్యార్థులకు ఉండే వ్యత్యాసం చూస్తే ఈ విష యం అర్థమవుతుంది.

# 'డ్రై' డే పై అవగాహన కల్పించిన కార్పొరేటర్ గంకల కవిత అప్పారావు






కంచరపాలెం : విశాఖ పార్లమెంటు జిల్లా భాజపా నేత గంకల కవిత అప్పారావు 48 వ వార్డు లో పలు ప్రాంతాల్లో పర్యటించి డ్రై డే పై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా గంకల అప్పారావు మాట్లాడుతూ ఒకపక్క కరోన తొ ప్రజలు ఇబ్బంది పడుతుంటే మరోపక్క డెంగ్యూ మలేరియా వంటి జ్వరాలు అత్యధికంగా ఉన్నాయని ప్రజా ప్రతినిధిగా ప్రజల ప్రాణాలు కాపాడడం తన బాధ్యత అని అన్నారు.

నీరు నిల్వ ఉన్నచోట దోమలు పుడతాయని అవి కుట్టడం కారణంగా వచ్చే విషజ్వరాలు డెంగ్యూ మలేరియా చికెన్ గున్యా మొదలగు వ్యాధులతో ప్రజల ప్రాణాలకే ముప్పు ఉందని కావున అందరూ సహకరించి ఎక్కడ నీరు నిల్వ లేకుండా చూసుకొవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే గా పాటించాలని ప్రజలందరూ ఈ యొక్క యజ్ఞం లో భాగస్వాము్యలు అవ్వాలని కోరుతూ ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొన్న సానిటరీ సిబ్బంది సచివాలయ సిబ్బంది గ్రామస్తులు అందరికీ ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది.

# మేయర్ చే వరద బాధితుల కుటుంబాలకు తక్షణ సహాయం

## - నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి



విశాఖపట్నం : ''గులాబ్'' తుఫాను వలన ముంపుకు గురైన వరదబాధితుల కుటుంబాలకు నగర మేయర్ తక్షణ సహాయం కింద వెయ్యి రూపాయలు చొప్పున పంపిణీ చేశారు. బుధవారం ఆమె 2వ జోన్ 13వ వార్డు పరిధిలోని రామకృష్ణాపురంలో ముంపుకు గురై ఇళ్ళల్లోకి నీరు చేరిన 70 కుటుంబాలకు వెయ్యి రూపాయల చొప్పున వార్డు కార్పొరేటర్ సునీత సత్యనారాయణతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై. ఎస్. జగన్మోహన్ రెడ్డి జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా సమర్థవంతంగా ''గులాబ్'' తుఫానును ఎదుర్కోవడం జరిగిందని తెలిపారు. ముందస్తుగా చాలా కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించామని వారికి భోజనం వసతి, త్రాగునీరు లాంటి అన్ని ఏర్పాట్లు చేశామని, ప్రభుత్వం బాధితులను ఆదుకోవడం కొరకు తక్షణం సహాయం కింద వెయ్యి రూపాయలు ఇచ్చిందని, అన్ని వార్డులలోని నిరాశ్రయులైన వారిని అన్ని విధాలుగా ఆదుకుంటామని మేయర్ తెలిపారు. రామకృష్ణాపురంలో దాదాపు 250 కుటుంబాలు రేకుల షెడ్లలో నివసిస్తున్నారని వారందరికీ గ్రౌండ్ ఫ్లోర్ కట్టుకునేందుకు అనుమతి కొరకు జిల్లా కలెక్టర్ తో మాట్లాడటం జరిగిందని మేయర్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో...

ఆర్.డి.ఒ., ఇతర అధికారులు, వై.ఎస్.ఆర్.సి.పి. నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కవి సమయం

## 'ముసలం'

కాదు - కాదోయ్
ఇది ముసలం అంటే ముసలం కాదోయ్
చీ॥ ముసురులాంటిది అసలే కాదోయ్
వెన్నముద్దలు కురిపించే
వెన్నెల వర్షమోయ్!
ఈ ముసలం అంటే;
ముసలితనం కాదోయ్
మరో నవయుగ ప్రపంచంగా తీర్చిదిద్దెవోయ్
ఈ ముసలం అంటే;
వీచుడు గాలులు లాంటిది కాదోయ్
పిల్ల వాయువులు వీచె ప్రాణదాతవోయ్
ఈ ముసలం అంటే;
ఊర్లలను వల్లకాడగ చేసే కలరా లాంటిది కాదో!
వల్ల కాడలను భూతల స్వర్గముగ చేసేదోయ్ ॥కాదు॥
ఈ ముసలం యాక్ట్ పాస్ చేసిందంటే;
ధిక్కారం చేసే దమ్ము ఎవరికున్నదోయ్!
రహదారులు నిర్మాణం తలపెట్టిందంటే;
రహదారులు కిరువైపుల చిన్నా... పెద్దా!
ఇల్లు, షాపులు నేలమట్టం చెయ్యిడమే దీని పనివోయ్
ముష్ఠి యుద్ధం జర్పె వార్కి
బెల్లం మోపు తిన్పించె చెఱుకుగానుగోయ్! ॥కాదు॥
ఈ ముసలం అంటే;
పిడుగులు - మెరుపులు కురిపించె
మేఘం కాదోయ్!
సర్వ సుఃఖాభివృద్ధికై;
అమృతం వంటి పథకాలు పంచె జగన్మోహినోయ్!
అందుకే టాక్సులు - జియస్‌టిలు బిగుస్తున్నదోయ్
విచారమే ముసలితనం - పేదోళ్లకు
తనువె-యవ్వనం - గొప్పోల్లకి
ఇరువుర్ని సమ ఉజ్జీ చేసే తలంఫే
ఈ ముసలం ఉద్ధేశ్యమోయ్!
ఈ ముసలం అంటే;
ముండ మూతిక ముగ్గుర్ని చంపెది కాదోయ్!
వెలుగు - జిలుగులు ప్రసరించె విద్యుత్ వంటిదోయ్ ॥కాదు॥

...కవితా రచన
యల్.సిద్ధా

# పంచాంగం

మాసం : భాద్రపద; తిథి : నవమి రా.6.05; పునర్వసు రా.11.0; వ.ఉ.10.00 ల 11.44.

గురువారం 30-09-2021

**మేషం** : కొంతవరకు శుభములే జరుగును. విందు వినోదములలో పాల్గొంటారు. కుటుంబ కలహములు తొలగిపోవును. తీర్థయాత్ర ఫలప్రాప్తి కలుగును.

**వృషభం** : కుటుంబ ఖర్చులు అధికము. శతృమూలకంగా ఇబ్బందులుండును. ఆరోగ్యం జాగ్రత్త. ఊహించనవి మీకు ఎదురగును. పట్టు దలతో మీరు మీ పనులు పూర్తి చేస్తారు.

**మిథునం** : కోర్టు వ్యవహారముల యందు విజయం. ఆర్థిక లావా దేవీలు చేస్తారు. ఉద్యోగులకు వృత్తిరీత్యా లాభం. నిరుద్యోగులకు ఉద్యోగి ప్రయ త్నం వలన జయం. క్రయ విక్రయములు చేస్తారు. ఆర్థికంగా లాభం కలుగును.

**కర్కాటకం** : స్త్రీలకు ముఖ్యుల నుంచి ఆహ్వానాలు అందుకుంటారు. అయినవారితో ఉల్లాసంగా గడుపుతారు. నిరుద్యోగులకు ఉపాధి పథకాల పట్ల ఆసక్తి పెరుగుతుంది.

**సింహం** : ఫైనాన్సు రంగమందు ఉన్నవారికి చాలా యోగం. నూతన వస్తువులు కొనుగోలు చేస్తారు.

**కన్య** :పెద్దలతో పరిచయాలు పెరుగును. వ్యాపార లావాదేవీలు బాగుండి ధనలాభం కలుగును. శుభ కార్యములు కలసి వచ్చును. శుభవార్తలు వింటారు. కుటుంబ వ్యక్తులతో సంతోషంగా గడుపుతారు.

**తుల** : విద్యార్థులకు చదువుతో పాటు ఇతర్రతా ప్రోత్సాహకాలు లభిస్తాయి. ఇతరు లకు వాహనం ఇచ్చేటపుడు లౌక్యం పాటించండి. దైవ, పుణ్య కార్యక్రమాల పట్ల చురుకుగా పాల్గొంటారు. నిరుద్యోగులు వచ్చిన అవకాశా లను చేజార్చు కుంటారు.

**వృశ్చికం** : భూ సంబంధ వ్యవహారము యందు మధ్య వర్తిత్వం జరిపి సమస్యలు పరిష్కారం చేయుదురు. ఉద్యోగస్తులు ఒత్తిళ్ళకు లొంగ కుండా స్థిరచిత్తంతో వ్యవహరించవలసి ఉంటుంది.

**ధనుస్సు** : ప్రేమి కులకు పెద్దల నుండి వ్యతిరేకత, ఇతర్రతా చికాకులు అధికమవుతాయి. ఆడిటర్లకు ఒత్తిడి, లాయర్లకు కలిసివచ్చే కాలం. ఉద్యోగ రీత్యా దూర ప్రయాణాలు చేస్తారు.


**మకరం** : ప్రయాణముల యందు జాగ్రత్త. విలువైన వస్తువులు పొగొట్టు కునుట, స్త్రీలకు శ్రమాధిక్యత, మానసికాందోళనల వల్ల ఆరోగ్యము మందగిస్తుంది. ప్రముఖులను కలుసుకుంటారు.

**కుంభం** : మిత్రుల ద్వారా సహాయ సహకారం, కార్యజయం, పాతబాకీలు వసూలు అగుట, ఖర్చులు అధికం. ఆర్థికంగా లాభం. నూతన పరిచయాలు పెరుగును. కొత్త పనులకు శ్రీకారం. ఆనందంగా వుంటారు.

**మీనం** : ధనదాయం బాగుండును. కోర్టు వ్యవహార పనులు తేలవచ్చును. అన్ని రంగముల వారికి లాభదాయకం. నిరుద్యోగులకు స్థిరత్వం. అభివృద్ధి పనులు చేస్తారు. కీర్తి, గౌరవము పొందుతారు. ఆర్థిక సమస్యలు పరిష్కారమవుతాయి

# రాజసం ఉట్టిపడే రాతి నిర్మాణాలు

## సంకీర్తన



త్రికుటేశ్వరాలయం

సూర్యాపేటకు తొమ్మిది కిలోమీటర్ల దూరంలో ఉన్న పిల్లలమర్రిలో కాకతీయుల కాలంలో జీవం పోసుకున్న దేవాలయాలు, శిల్పకళా సంపద.. భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టిపడేలా కళ్లకు కట్టినట్లుగా కనిపిస్తున్నాయి. బౌద్ధ మతానికి సంబంధించిన ప్రతిమలను, జీవిత ఘట్టాలను, జ్ఞానోదయ చిత్రాలతోపాటు శాంతి చిహ్నాలు తదితర సన్నివేశాలు, ఆరామ కుడ్యాలపై ఎంతో అద్భుతంగా చెక్కబడ్డాయి. బౌద్ధ శిల్పకళలో సహజ సుందర దృశ్యాలకు, పశు పక్షాదులకు కూడా స్థానం లభించింది. అయితే మత ప్రచారానికి తోడ్పడే విధంగా అది రూపాంతరం చెందింది. ఉత్తర దక్షిణ శిల్పకళా సంస్కృతుల సమ్మేళనంతో కొత్త తరహా శిల్పకళను ఇక్కడ ప్రవేశపెట్టిన ఘనత కాకతీయులకే దక్కింది. క్రీ.శ.1000 నుంచి 1324 వరకు కాకతీయరాజులు ఆంధ్రదేశాన్ని పరిపాలించారు. ఇదే కాలంలో వారి సామంతులుగా, మాండలికులుగా నల్లగొండను పాలించిన రేచర్ల వంశస్థులు ఈ తరహా శిల్పాలను ఆదరించారు. వీటిలో భాగంగానే పిల్లలమర్రి, పెన్‌పహాడ్ మండలం నాగులపాటి అన్నారం గ్రామాల్లో నిర్మించిన దేవాలయాలు శిల్పుల మేధాశక్తి, కళలకు ప్రతీకలుగా చెప్పవచ్చు.

ఒకవైపు కాకతీయ సామ్రాజ్య సంరక్షణకు యుద్ధాలు చేస్తూనే మరోవైపు శిల్పకళను ప్రోత్సహించడం వారి బహుముఖ ప్రజ్ఞాపాటవాలకు నిదర్శనం. ఆనాటి శిలలపై నగ్న దృశ్యాలు, సౌందర్య కుసుమాలు తదితర దర్పణంలాంటి చెక్కడాలు కళ్లను మైమరిపిస్తాయి.

**త్రికుటేశ్వరాలయం**

పిల్లలమర్రి గ్రామం ఉన్న త్రికుటేశ్వరాలయాన్ని కాకతీయుల రాజు అయిన రేచర్ల నామిరెడ్డి క్రీ.శ.1202లో నిర్మించారు. దుందుభి నామ సంవత్సరం చైత్రశుద్ధ ఏకాదశి శనివారం నాడు రాజు తన పేర నామేశ్వరలింగం ప్రతిష్ఠించి పూజాధికారులకు, దూపదీప నైవేద్యాలకు భూదానం ఇచ్చారు. ఈ విషయం వివరిస్తూ అక్కడ శాసనం కూడా రాయించారు. అదే ఆలయంలో మూడు శివాలయాలు ఏర్పాటు చేశారు. నామిరెడ్డి పేరు మీదా మేశ్వ రాలయం మొదటిది కాగా, రాజు తన తల్లి పేరు మీద కాచేశ్వర, తండ్రి పేరున కామేశ్వర లింగాలను దేవాలయంలో ప్రతిష్ఠించాడని శాసనంలో ఉంది.

**దేవాలయాలతోపాటు పెద్దచెరువు**

పిల్లలమర్రిలో శిల్పకళా సంపద ఉట్టిపడే దేవాలయాలే కాదు.. త్రికుటేశ్వరాలయానికి అతి సమీపంలో పెద్ద చెరువు కూడా ఉంది. మూసీ నదిలో నీళ్లున్నంత కాలం ఆ చెరువులో జలకళ ఉట్టిపడుతుంది. **800 ఏళ్ల నాటి బావి**

ఎరుకేశ్వరాలయ ఆవరణలో 800 సంవత్సరాల క్రితం బేతిరెడ్డి భార్య ఎరుకసాని తాగునీటి కోసం తవ్వించిన బావి ఇప్పటికీ ఉంది. ఎంతటి వర్షాభావ పరిస్థితులు నెలకొని కరువు వచ్చినా ఆ బావిలో నీరు ఇంకిపోలేదని గ్రామస్తులు చెబుతున్నారు.

**త్రికుటాలయంలో ఆసక్తికరమైన నంది**

త్రికుటేశ్వరాలయంలో శివలింగాలను కాపాడేందుకు రేచర్ల నామిరెడ్డి నంది విగ్రహాన్ని చేశారు. ఆ నంది మూడు శివలింగాలను కాపాడుతున్నట్లు అనిపిస్తుంది.మూడింటిలో ఏ శివలింగం ముందు నిలబడి చూసినా నంది దాని వైపే చూస్తునట్లుగా కనిపిస్తుంది. అక్కడకు వచ్చే భక్తులు మూడు లింగాలను దర్శించుకొని వెళ్తుంటారు.



త్రికుటాలయంలో ప్రత్యేక నంది విగ్రహం

# గులాబ్ తుఫాన్ కారణంగా నష్టపోయిన గ్రామాల్లో పర్యటించిన ఎంపీటీసీ



అరకులోయ : మండలంలోని గన్నెల పంచాయతీ పరిధిలోగల ఆయా గ్రామాల్లో బుధవారం గన్నెల పంచాయతీ. ఎం పి టి సి. మోర్ధన్. లలితాదేవి పర్యటించారు అనంతరం ఆయా గ్రామాల్లో గల పంట నష్టపోయిన అలాగే నివాసగృహం పడిపోయిన రైతులతో వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం కారణంగా ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్న కారణంగా గన్నెల నుండి సుంకరమెట్ట వైపు వెళుతున్న బిడ్జి అంతరాయం కలగడంతో ప్రజలు ఇబ్బందులు ఏర్పడుతున్న ట్లు ఆమె తెలిపారు గులాబ్ తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులందరికీ పరామర్శించి ప్రభుత్వం నుండి వచ్చే ప్రతీ రాయితీ నష్టపరిహారం తప్పక అక్కడికి కల్పించే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్దామని ఆమె అన్నారు ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ అథ్లెటిక్స్ షాట్‌పుట్ లో

## కాంస్య మెడల్ సాధించిన వల్లూరి మాధవి




అన్నవరం : తూర్పుగోదావరి జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం హాస్పిటల్ నందు ఫార్మసీ సూపర్వైజర్ గా పనిచేస్తున్న వల్లూరి మాధవి ఇటీవల హర్యానాలోని కర్నాల్ లో జరిగిన ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ అథ్లెటిక్స్ షాట్ పుట్ లో మూడవ స్థానంలో నిలచి కాంస్య మెడల్ ను గెలుపొందారు. ఈ సందర్భంగా వల్లూరి మాధవిని దేవస్థానం ఈవో త్రినాధరావు, చైర్మెన్ ఐ.వి.రోహిత్, దేవస్థానం వైద్య అధికారి డాక్టర్ శ్రీకాంత్ మరియు దేవస్థానం అధికారులు, సిబ్బంది, గ్రామస్థులు తదితరులు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

# కూలిపోయిన కమ్మల ఇల్లులును పరిశీలించిన

## సర్పంచ్ చింతకాయల



పరవాడ : గులాబ్ తుపాన్ కారణంగా పరవాడ మండలము ముత్యాలమ్మపాలెం గ్రామ పంచాయితీ దిబ్బపాలెం గ్రామంలో గులాబ్ తుఫాన్ కారణంగా కమ్మలఇల్లులు కూలి పోయాయి. ఈ కూలిపోయిన కమ్మలఇల్లులును మంగళవారం స్థానిక సర్పంచ్, రాష్ట్ర పంచాయతీ రాజ్ చాంబర్ ఉపాధ్యక్షులు చింత కాయల సుజాత ముత్యాలు మరియు కో ఆప్షన్ సభ్యులు మైలపల్లి అప్పన్న,విఆర్ఓ అప్పారావు తోకలిసి పరిశీలించారు.

కమ్మల ఇళ్లు కూలిన బాధితులు కోవిరి యల్లమ్మ, కోవిరి నూకరాజు, కోవిరి సోములు, చింతకాయల కోర్లయ్య, గనగళ్ళ బంగారు రాజు తధితర బాధితులును వెంటనే ప్రభుత్వం అందుకోవాలని సర్పంచ్ చింత కాయల సుజాతముత్యాలు కోరారు.

# బస్సు టైరు పేలి గాయపడిన వారిని పరామర్శ



పరామర్శిస్తున్న శివప్రసాద్

కొయ్యూరు : ఏలేశ్వరం నుంచి నర్సీపట్నం వైపు వెళ్లతున్న వస్తున్న ఆర్టీసి బస్సు గొలుగొండ మండలం ఎర్రవరం రాజులబాబు గుడి దగ్గర్లో వెనకాల కుడివైపు టైర్ పేలడంతో అదే బస్సులో ప్రయాణిస్తున్న కొయ్యూరు మండలం చెందిన ముగ్గురు వ్యక్తులు కొర్రు శ్రావణి (ఎం.మాకవరం) కశింకోట అప్పారావు (దొడ్డవరం), అప్పికొండ పద్మ(పాతూరు) గాయపడినట్టు తెలుసుకున్న అరకు ఎంపి భర్త, నేను సైతం చారిటబుల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు శివప్రసాద్ వెంటనే హుటాహుటిగా నర్సీపట్నంలోని అక్షయ ఆస్పత్రికి చేరుకుని క్షతగ్రాతులను పరామర్శించారు. డాక్టర్ మల్లికార్జున్‌రావుతో మాట్లాడి క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందజేయాల్సిందిగా కోరారు. అనంతరం ఏలేశ్వరం డిపో మేనేజర్‌తో ఫోన్లో సంభాషించి క్షతగాత్రులకు వైద్యం అందజేసే బాధ్యత తీసుకోవాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో శివ ప్రసాద్‌తో పాటు ఆంధ్రప్రదేశ్ వైసిపి మెడికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కుడుముల రామకృష్ణ, గ్రీన్ విలేజ్ ఇంచార్జ్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# శాంతి వేధింపులు భరించలేకే వీధుల్లోకి వచ్చాం

## దేవదాయశాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ల ఆవేదన

విశాఖపట్నం : దేవదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ కె.శాంతి వేధింపులు భరించలేకనే వీధుల్లోకి వచ్చామని ఆ శాఖలో పనిచేస్తున్న ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు తమ ఆవేదనను తెలియజేశారు. ఆఫీసుకు రప్పించడం, గంటల తరబడి కూర్చోబెట్టడం, క్యాంపులకు వెళ్తున్నప్పుడు డబ్బులు ఇవ్వాలని వేధించడం పరిపాటి అయిందని తమ బాధను వ్యక్తపరిచారు.సీనియర్ ఈఓ పి. ఎస్.ఎన్.మూర్తి బుధవారం మీడియాతో మాట్లాడుతూ దేవదాయ శాఖ సిబ్బంది అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఆలయాల ఔన్నత్యాన్ని కాపాడాల్సిన తరుణంలో సహాయ కమిషనర్ శాంతి అందుకు భిన్నంగా వ్యవహరిస్తూ పాలనా వ్యవహారాలను భ్రష్టు పట్టిస్తున్నారని అన్నారు.

ఈ నేపథ్యంలోనే తామంతా సామూహిక సెలవు పెట్టాల్సి వచ్చిందని తెలిపారు.ఒక్కో ఈ.ఓ పర్యవేక్షణలో 20కి పైగా ఆలయాలు ఉంటాయని వాటి బాగోగులు చూడాల్సిన సమయంలో కార్యాలయానికి రప్పించి వేధింపు ధోరణిలో మాట్లాడే విధానం సరికాదన్నారు. నర్సీపట్నం ప్రాంతానికి చెందిన ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ టి. ఎన్. ఎస్.శర్మ మాట్లాడుతూ సస్పెండ్ అయిన శ్రీనివాసరాజు ద్వారా సహాయ కమిషనర్ శాంతి ఇంతవరకు 8 లక్షల 50 వేల రూపాయలు తనవద్ద నుండి గుంజారని చెప్పారు.గత కొంతకాలంగా ఇంటికి జీతాన్నికూడా తీసుకు వెళ్లలేదని ఆవేదన స్వరంతో పేర్కొన్నారు. 2 రోజుల క్రితం 50 వేల రూపాయలు ఇవ్వాలని శాంతి తనపై ఒత్తిడి తెచ్చారని డబ్బు ఇవ్వకపోతే ఆత్మహత్య చేసుకుంటానని ఆమె బెదిరించారని తెలిపారు.ఈ పరిస్థితుల్లో తానేమీ చేయలేక పోతున్నట్లు చెప్పారు.మరో ఈఓ పద్మ మాట్లాడుతూ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లను ఉదయం 11 నుండి రాత్రి 8 గంటల వరకు ఒక అటెండర్ మాదిరిగా కూర్చోబెట్టి ఆ తర్వాత ఇంటర్వ్యూ ఇవ్వకుండా అటెండర్ ద్వారా వెళ్లిపొమ్మని చెబుతుంటారని కన్నీళ్లు పర్యంతమయ్యారు.

ఆలయాల ఆదాయం పెంపుదల, భక్తులకు సౌకర్యాలు కల్పించడం వంటివాటిపై దృష్టిపెట్టాల్సిన తాము ఏసీ కార్యాలయంలో గంటల తరబడి ఖాళీగా కూర్చోవల్సి వస్తోందని ఆఫీసుకు రప్పించడం వెళ్ళగొట్టడం పరిపాటి అయిందని ఇంతకు ముందు పని చేసిన ఏసీలు ఇలా వ్యవహరించిన సందర్భాలు లేవన్నారు.ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు ప్రతి ఒక్కరూ ఇదే విధమైన భావన మీడియా ముందు వ్యక్తపరిచారు.శాంతిని బదిలీ చేసే వరకు తాము విధులకు హాజరు కాబోమని మరోసారి స్పష్టం చేశారు.

సహాయ కమిషనర్ కార్యాలయ సిబ్బంది కూడా సామూహిక సెలవులోనే ఉన్నారు. మరోవైపు సహాయ కమిషనర్ కార్యాలయ సిబ్బంది, మరియు ఈఓలను దేవదాయ శాఖ ప్రాంతీయ కమిషనర్ సురేష్ బాబు డిప్యూటీ కమిషనర్ సూర్యకళలు చర్చలు జరిపారు శాంతిని ప్రభుత్వం సస్పెండ్ చేస్తుందా లేదా బదిలీ చేస్తుందా అనే దానిపైనే ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు,సహాయ కమిషనర్ కార్యాలయ సిబ్బంది విధులకు హాజరయ్యే అంశం ఆధారపడి ఉంది.

# టిఎల్‌వి ప్రసాద్ కు

# టీడీపీ నేతల ఘన నివాళి



చోడవరంలో ఎల్.వి.ప్రసాద్ కు నివాళులర్పిస్తున్న టిడిపి నేతలు

చోడవరం : చోడవరం పంచాయతీ వార్డు నెంబర్, వార్త రిపోర్టర్, టీ శ్రీను సోదరుడు టిఎల్‌వి ప్రసాద్ కు టిడిపి నేతలు ఘన నివాళి అర్పించారు.

ఇటీవల ప్రమాదవశాత్తు ఎల్.వి.ప్రసాద్ అక స్మాత్తుగా మృతి చెందగా బుధవారం జరిగిన దినకర్మ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే రాజు, నియోజకవర్గ ఇన్చార్జి బత్తుల తాతయ్య బాబు, టిడిపి రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్య క్షులు గూనురు మల్లు నాయుడు, మాజీ ఎంపీపీ పెదబాబు, ఎంపీటీసీ చిన్నా తదితరులు పాల్గొని టి.శ్రీను కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# రాబడిలో రాణీలు మెప్మాలోని మహిళా సంఘాలు



విశాఖపట్నం జిల్లా (నర్సీపట్నం) : ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేస్తున్న మెప్మా మహిళలు, నర్సీపట్నం మున్సిపాలిటీలోని 1400 సంఘాలు ఉన్నాయి. ఇందులో 989 సంఘాలు రుణమాఫీ కి అర్హత సాధించాయి. శారద నగర్ చర్చి లైన్ లో వెంకటేశ్వర గ్రూపులోని మహిళలంతా టైలరింగ్ మెటీరియల్ అమ్మకం మరియు శిక్షణ కేంద్రాన్ని కేంద్రాన్ని విజయ వంతంగా నడిపిం చడంలో సఫలీకృతులయ్యారు.ఈ గ్రూప్ కి 5లక్షల 83 వేలు రుణమాఫీ జరిగింది. ఇటీవలే సున్నా వడ్డీ 28,000 వచ్చింది. వైయస్సార్ ఆసరా ద్వారా వచ్చిన లబ్ధిని తమ వ్యక్తిగత ఖాతాలకు పంపాలని బుధవారం సభ్యులంతా సమావేశమై తీర్మానం చేశారు. అధ్యక్ష కార్యదర్శులు పి నాగలక్ష్మి శ్రీలక్ష్మి ఇద్దరు అనేకమందికి టైలరింగ్ లో శిక్షణ ఇస్తున్నారు. వీరికి సలహాలు సూచనలు రిసోర్స్ పర్సన్ పద్మజ, కమ్యూనిటీ ఆర్గనైజర్ రవి తదితరులు ఇస్తున్నారు.

# సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## మండల ఈఓ పీఆర్డీ మల్లేశ్వరరావు



అనంతగిరి : ఒకపక్క కరోనా విలయం, మరోపక్క సీజనల్ వ్యాధులతో ప్రజలు బెంబేలెత్తు పోతున్నారని విలేఖరులతో మాట్లాడిన ఆయన ప్రస్తుతం వర్షాకాలం దృష్ట్యా డెంగ్యూ, మలేరియా కేసులు రోజురోజుకు పెరుగుతున్న కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డెంగ్యూ కేసులు ఎక్కువగా పెరగడం ఆందోళన కలిగించే విషయమని, ప్రజలు స్థానిక అధికారులకు సహకరించి ఇంటి పరిసరాలు పరి శుభ్రంగా ఉంచే విషయంలో వారి యొక్క సలహాలు పాటించి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూసుకోవాలని అన్నారు. ఇప్పటికే కరోనా కారణంగా ఎన్నో కుటుంబాలు చిన్నాభిన్నం అయ్యాయని, ఆ విపత్తు నుండి బయట పడకుండానే ప్రస్తుతం వర్షాకాలం కారణంగా డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు చుట్టుముట్టి ప్రజల జీవితాలను నాశనం చేస్తూ కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయని అన్నారు. అందువలన ప్రజలు అప్రమత్తంగా ఉండి జ్వరం, జలుబు, ఒంటినొప్పులు ఏమైనా లక్షణాలు ఉంటే డాక్టర్లను సంప్రదించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా వర్షాకాలం దృష్ట్యా పంచాయతీ శానిటరీ సిబ్బంది పారిశుధ్యం విషయంలో గాని, ప్రజలకు పారిశుద్యంపై అవగాహన కల్పించడంలో గాని ఎప్పటికప్పుడు ప్రజలకు తగు సూచనలు సలహాలు ఇవ్వాలని అధికారులకు శానిటరీ సిబ్బందికి సూచించారు, ఈకార్యక్రమంలోఆరోగ్య శాఖ సిబ్బంది , నందయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు,

# బాకురు సర్పంచ్ కుటుంబానికి అండగా ఉంటాం

## వెంకటరమణ తల్లి పెద్దకర్మ లో మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్



పాడేరు : హుకుంపేట మండలం బాకురు పంచాయితీ సర్పంచ్ బాకురు వెంకటరమణ రాజు తల్లి ఇటీవల మరణించడం జరిగింది ఈ సందర్భంగా బాకురు గ్రామంలో పెద్ద కర్మ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ పాల్గొని ఆమె చిత్ర పటానికి ఘన నివాళి అర్పించిన అనంతరం కుటుంబ సభ్యులకు అన్ని విధాలుగా తోడుగా ఉంటామని అధైర్య పడవద్దని దైర్యం చెప్పారు అనంతరం కుటుంబ సభ్యుల యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు ఏ అవసరం ఉన్న తన దృష్టికి తీసుకు రావాలనిమీ కుటుంబంలో నేను ఒక సభ్యుడేనని బాకురు సర్పంచ్ బాకురు వెంకటరమణ రాజు కుటుంబానికి దైర్యం చెప్పారు.

కుటుంబానికి పరామర్శించదానికి వచ్చిన మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ తో పాటు ఎస్సీ ఎస్టీ కమిషన్ మెంబర్ సివేరి అబ్రహం, సర్పంచులు బాకురు వెంకటరమణ రాజు, పాంగి పాండురంగ స్వామి, తమర్ల సత్యనారాయణ, ఎంపీటీసీ కొమ్మ రమ, టీడీపీ మండల అధ్యక్షులు తులసీరావు, బుజ్జిబాబు,మాజీ సర్పంచలు కూడ వెంకటరావు, రామలింగం, టీడీపీ సీనియర్ నాయకులు శెట్టి లక్ష్మణుడు, కంబిడి, రాంబాబు, సాగర సుబ్బారావు, బొడ్డ శ్యామ్,పలసీ శశి భూషణ్ నాయుడు, సోమెల్లి లక్ష్మయ్య, సూర్యకాంతం, మహేశ్వరి, శంకర్, స్వామి, కామేష్, అప్పలస్వామి,వాసుదేవ్, నూకరాజు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉద్యమాల శ్రమదానం చేపట్టిన ప్రజలు

దేవరాపల్లి : ప్రజా అవసరాల కోసమే వైసిపి పార్టీ, ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి పాలన ముందుంటుందని ప్రభుత్వ విప్ బూడి ముత్యాలనాయుడు అన్నారు. మండలంలోని ఎం. అలమండ గ్రామస్తుల సహకారంతో గవర్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్, గ్రామ సర్పంచ్, మాజీ సర్పంచ్ పోతల లక్ష్మి శంకర్ నాయకత్వంలో అలమండ గ్రామం నుంచి వారాడ గ్రామ సమీపం వరకు రోడ్డు కిరువైపులా ఉన్న తుప్పలు తొలగించి శుభ్రపరిచారు. వందలాది మంది గ్రామ ప్రజలు పాల్గొన్న ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్ బూడి ముత్యాలనాయుడు ప్రారంభించారు. కార్యక్రమం అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మన రోడ్లు మనమే శుభ్రం చేసుకోవాలి అన్న నినాదంతో ప్రారంభమైన ఈ కార్యక్రమానికి ప్రజలు సహకరించడం అభినందనీయమన్నారు.

# మాజీ ఎమ్మెల్యే 'పైలా' కుటుంబంతో రావాడకు అత్మీయ బంధం

**- 1995లో ఎంపిపిగా పైల జయలక్ష్మి, వైస్ ఎంపిపిగా రామస్వామి నాయుడు**

**- 2021న ఎంపిపిగా పైల పద్మలక్ష్మి శ్రీనువాస్, వైస్ ఎంపీపీగా బంధం నాగేశ్వరావు**

**- వైస్ ఎంపీపీ పదవి రావాడకు రావడం పట్ల హర్షం - ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన వైస్ ఎంపీపీ బంధం**



పరవాడ : పరవాడ మాజీ శాసనసభ్యులు శ్రీ॥ శే॥పైల అప్పలనాయుడు(నాయుడుబాబు) అంటే తెలియనివారు ఎవరూ లేరు అనడములో ఎటువంటి సందేహం లేదు. అతను మరణించినా ప్రతి పేదవాడు గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. అటువంటి పైలా కుటుంబంతో రావాడపంచాయితీకి అనుహ్యామైన అత్మీయబంధం ఉందిఅని రావాడ పంచాయితీ ప్రజలు పలువురు అంటున్నారు. 1995లోఅయన సతీమణి పైలజయలక్ష్మి ఎంపిపిగా ఉన్నప్పుడు వైస్ ఎంపిపిగా రావాడకు చెందిన శ్రీ''శే''కావలి రామస్వామిన నాయుడును వైస్ ఎంపిపిగా ఎన్నుకున్నారు.అదేతరహాలో ఇరవై సంవత్సరాలు తరువాత పరవాడ ఎంపిపిగా పరవాడ మాజీశాసనసభ్యులు పైలఅప్పలనాయుడు(నాయుడుబాబు) కోడలు వైసిపి సిఇసి సభ్యులు పైలశ్రీనువాసురావు సతీమణి పైలవెంకటపద్మ లక్ష్మి శ్రీనువాస్ ను ఎంపిపి పీఠం వరించగా వైస్ ఎంపిపిగా పరవాడ మండలము రావాడకు చెందిన బంధంనాగేశ్వరావును వైస్ ఎంపిపిగా ఎన్నుకున్నారు.వైస్ ఎంపిపిపదవి రావాడకు రావడంపట్ల రావాడ,భరణికం పంచాయితీ ప్రజలు సంబరాలు చేసుకుంటున్నారు. ఇరవై సంవత్సరాలు తరువాత పరవాడ మాజీ శాసనసభ్యులు పైలనాయుడుబాబు కోడలు, వైసిపీ సిఇసి సభ్యులు పైల శ్రీనువాసురావు సతీమణి పైల వెంకట పద్మలక్ష్మి శ్రీనువాస్ ఎంపిపికావడం మాకు ఎంతో అనందకరమైన విషయమైతే వైస్ ఎంపిపిగా రావాడకు చెందిన బంధంనాగేశ్వరావుకు వైస్ ఎంపిపిగా ఎన్నుకోవడం గర్వంచదగ్గ విషయమనీ రావాడ,భరణికం పంచాయితీ ప్రజలు అంటున్నారు. ఈసందర్భంగా బుధవారం విజయభాను ప్రతినిథితో వైస్ ఎంపిపి బంధం నాగేశ్వరావు మాట్లడుతూ నారాజకీయ గురువు వైసిపి సిఇసి సభ్యులు పైలశ్రీనువాసురావు అని అన్నారు. ఇరవై ఎళ్ళుతరువాత వైస్ ఎంపిపి పదవిరావాడకు రావడం పట్ల నాకు ఎంతో అనందత్సోవముగా ఉంది అన్నారు.

నీను జీవితాంతము శ్రీ''శే'' పైలఅప్పలనాయుడు కుటుంబానికి రుణపడి ఉంటాను అన్నారు. రావాడ భరణికం సెగ్మంట్ నుండి ఎంపిటిసిగా గెలిచివైస్ ఎంపిపి పదవి నన్ను వరించింది అంటే దానికి ముఖ్యకారణం స్థానిక శాసనసభ్యులు అన్నంరెడ్డి అదీప్ రాజ్ మాపంచాయితీలుపై చూపిస్తున్న ప్రత్యేక శ్రద్ధ ఒకటిఅయితే నారాజకీయ గురువు వైసిపి సిఇసి సభ్యులు పైలశ్రీనువాసురావు సలహాలు సందేశాలు నాగెలుపుకు కారణాలు అని తెలిపారు. రావాడ భరణికం సెగ్మంట్ నుండి నన్ను అత్యదిక మెజార్టితో గెలిపించిన రావాడ మరియు భరణికంప్రజలుకు, నాయకులుకు, కార్యకర్తలుకు ధన్యవాదములు తెలిపారు. వైస్ ఎంపిపిగా ఎన్నుకున్నందుకుగానూ స్థానిక శాసనసభ్యులు అన్నంరెడ్డి అదీప్ రాజ్ కు, పెందుర్తి వైసిపి ఇంచార్జి అన్నంరెడ్డి అజయ్ రాజ్ కు, పరవాడ ఎంపిపి పైలవెంకటపద్మలక్ష్మి శ్రీనువాస్ కు,పరవాడ జడ్పిటిసి పియస్ రాజుకు, వైసిపి జిల్లా ప్రదాన కార్యదర్శి చుక్కరామునాయుడుకుమండలములో వైసిపి ఎంపిటిసి సభ్యులుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియపరిచారు.

## గులాబ్ తుఫాన్ వలన పాడయిన రోడ్లను పరిశీలించిన జెడ్పీటీసీ దీసరి గంగరాజు

**వైసీపీ మండల పార్టీ అధ్యక్షుడు శెట్టి ఆనంద్**

**తహశీల్దార్ వెంకట వరప్రసాద్, మండలం అధికారులు**



అనంతగిరి : గులాబ్ తుఫాన్ కారణంగా అనంతగిరి మండలంలో... దెబ్బతిన్న ఎగువశోభ, బొరజోల గ్రామాల రోడ్ల ను పరిశీలించిన....

మండల పార్టీ అధ్యక్షుడు, శెట్టి ఆనంద్. సర్పంచ్ కొర్రా సింహాద్రి తాహ శీల్దార్ వెంకట వరప్రసాద్. ట్రైబు వెల్ఫర్ ఏఇ. అప్పలనాయడు వీఆర్వో విజయలక్ష్మి. సెక్రటరీ. రమేష్ సీపీఎం నాయ కులు. ఎస్. నాగులు. సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సత్యదేవుడ్ని దర్శించుకున్న ఎమ్మెల్యే కొండేటి



అన్నవరం : తూర్పుగోదావరి జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామివార్ని బుధవారం గన్నవరం ఎమ్మెల్యే కొండేటి.చిట్టిబాబు శ్రీ స్వామి వారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వ హించారు. ఆయనకు దేవస్థానం పిఆర్వో కొండలరావు ఘన స్వాగతం పలికారు. దర్శనం అనంతరం వేద పండితులు వేద ఆశీర్వాదములు అందజేశారు. ఈ కార్యక్రమంలో...

ఆలయ సూపరింటెండెంట్ పర్వత.నరేష్,టెంపుల్ ఇన్స్పెక్టర్ నరాల.గోవిందు తదితరులు పాల్గొన్నారు.

## 1వవార్డు విల్సన్ పేటలో మంచి నీటి సమస్య పరిష్కారం



భీమునిపట్నం: జీవీఎంసీ భీమిలీ జోన్ 1వ వార్డ్ విల్సన్ పేటలో గత కొన్ని రోజులుగా బోర్ పని చేయక స్థానికులు మంచినీటి కోసం అవస్థలు పడ్డారు.ఈ విష యం తెలుసు కున్న వైఎస్సార్సీపీ జీవీఎంసీ 1వ వార్డ్ ఆక్కర మాని.పద్మావతి రామునాయుడు సంబంధిత అధికారులు పిలిపించి పైప్స్ వేయించి సమస్యను పరిష్క రించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ అధ్యక్షుడు సిమిలి ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

## పరిశరాల పరిశుభ్రత పై అవగాహన



విశాఖపట్నం జిల్లా (నర్సీపట్నం) : నియోజక వర్గంలో గొలుగొండ మండలం చీడిగుమ్మల గ్రామంలో పరిశరాల పరిశుభ్రత పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బుదవారం జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాపారపు చిన్నబ్బాయి, సెక్రటరీ సత్యనారాయణ, ఏ యన్ యమ్ రవణమ్మ, మహిళా పోలీస్ హేమ బిందు, అంగన్వాడీ కార్య కర్తలు సత్య ఘటీలు ఆశ కార్యకర్తలు చిట్టమ్మ మాతమ్మ వాలంటరీ స్ అప్పలనాయుడు రాజి యమ్.హెచ్.ఓ సుధ వీఆర్వో అప్పలరాజు పాల్గొన్నారు.

# భీమిలి.చరిత్రను, ప్రకృతి అందాలను కాపాడండి



భీమునిపట్నం : భీమిలి పురాతన చరిత్ర కలిగిన ప్రదేశమని, భీమిలి మున్సిపాలిటీగా ఏర్పడి 150 సంవత్సరాలు పూర్తయి గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు కూడా జరుపుకుందని, భీమిలి అందాలు కనుమరుగయ్యే వేళ మంత్రి , జివిఎంసి కమీషనర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని భీమిలి ప్రాంతాన్ని కాపాడాలని భీమిలి జోన్ 3వ వార్డు కార్పొరేటర్ గంటా అప్పలకొండ, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, భీమిలి డివిజన్ అధ్యక్షులు గంటా నూకరాజు సంయుక్తంగా కోరారు. భీమిలిలో ఉన్న మాజీమంత్రి గంటా శ్రీనివాసరావు విడిది కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మనదేశానికి స్వాతంత్ర్యం రాక పూర్వం బ్రిటిష్ వారు, డచ్ వారు భీమిలినే కేంద్రంగా చేసుకుని వ్యాపార లావాదేవీలు నిర్వహించే వారని, రాష్ట్రంలోనే ప్రధమ మున్సిపాలిటీగా, దేశంలోనే రెండవ మున్సిపాలిటీగా మంచి పేరున్న ప్రదేశం భీమిలి అని అన్నారు. అంత ప్రాధాన్యం ఉన్న భీమిలి ప్రభుత్వాల లోపాలు కారణంగా అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని వాపోయారు. భీమిలి బీచ్ కి పర్యాటకులు పెరుగుతున్న వేళ భీమిలి చరిత్రకు తగ్గట్టు ఆకృతులను ఏర్పాటు చేసి సందర్శకులను ఎంతో ఆకట్టుకొనేవిధంగా ఉండేవని ఇప్పుడు వాటి జాడ ఎక్కడుందో తెలియదని అన్నారు.భీముడు - బకాసురుడు, కుంతీదేవి పంచపాండవులు, ఛత్రపతి శివాజీ గుర్రంపై స్వారీ చేస్తున్నట్లు, అష్టలక్ష్మి విగ్రహాలు,సముద్రపు రాళ్లపై సాగర కన్య విగ్రహాలు, మత్స్యకారులు పడవపై వేట చేస్తున్నట్లు, స్వామి వివేకానంద నిలువెత్తు విగ్రహం,

శ్రీ సిద్ధి వినాయక గుడి,సందర్శకులు భీముడు - శివలింగం. గౌతమ్ బుద్ధుడు - శిష్యులు విగ్రహాలు, విక్టోరియా రాణి ఇలాంటివి ఎన్నో ఆకృతులు భీమిలి తీరంలో ఏర్పాటు చేసి వచ్చిన సందర్శకులను ఆకర్షించేవి. దానికి తోడు సుందరమైన బీచ్ పార్క్, జమ్మి చెరువు పార్క్ ఎంతో సుందరంగా ఉండేవని అన్నారు. కానీ 2015వ సంవత్సరంలో వచ్చిన హుద్ హుద్ తుఫాను కారణంగా పైన సూచించునటువంటి ఆకృతులన్నీ కనుమరుగు అవడమే కాకుండా, నాడు కోతకు గురైన సముద్ర తీరాన్ని నేటికి అలానే ఉంచేశారని అన్నారు. తీరం కోతకు గురై సముద్రం ముందుకు రావడంతో మత్స్యకారులు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారు. తీరంలో మత్స్యకారుల గ్రామం అయిన బోయవీధి నుండి నోవేటల్ మధ్యలో తీరం ఎక్కువగా కోతకు గురవడం స్థానికులను కలవరపెడుతోంది. గత ప్రభుత్వ హయాంలో అప్పటి జిల్లా కలెక్టర్ యువరాజ్ తో భీమిలి బీచ్ ని సందర్శించడమైనది. తీరంలో రక్షణ గోడ నిర్మించాలని నాడు అధికారులు ఇచ్చిన రిపోర్ట్ ప్రకారం 20 కోట్ల రూపాయలు మంజూరు చేసి ఉన్నారు. ఆ ప్రతిపాదనకు సంబంధించిన ఫైల్ ను బయటకు తీసి భీమిలి బీచ్ తీరంలో రక్షణ గోడ నిర్మించాలని, భీమిలి ప్రాధాన్యతను కాపాడాలని కోరారు.అదేవిధంగా జిల్లా అధి కారులు, జోనల్ అధికారులు ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ తో భీమిలి తీర ప్రాంతాన్ని సందర్శించి స్థానిక మత్స్యకార నాయుకులతో చర్చించి నట్లయితే పూర్తిస్థాయి సమాచారం వచ్చే అవకాశం ఉంటుందని గంటా అప్పలకొండ, గంటా నూకరాజు కోరారు.

## జడ్పీటిసీ లాలం రాంబాబు భవిష్యత్ లో మరిన్ని పదవులు చేపట్టాలి



అచ్యుతాపురం : జడ్పీటిసీగా బాధ్యతలు చేపట్టిన లాలం రాంబాబు భవిష్యత్ లో మరిన్ని పదవులు చేపట్టాలని దళిత నాయకులు, తుంపాల సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు అన్నారు. బుధవారం అచ్యుతాపురంలో షెడ్యూల్ కూలాల హక్కుల పరిరక్షణ సంఘం ఆద్వర్యంలో జడ్పీటిసీ లాలం రాంబాబుకు శాలువ కప్పి పుష్పగుచ్ఛం అందజేసి సత్క రించారు . ఈ సన్మాన కార్యక్రమంలో మండల మాలమహానాడు మండల అధ్యక్షుడు ఈరిగిల సంతోష్ కుమార్ , తట్టా రాజు, ఊషా అప్పారావు తదితరులు ఉన్నారు.

## గులాబీ తుఫాన్ వలన నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

**- అనంతగిరి మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు శెట్టి నీలవేణి**



అనంతగిరి : అనంతగిరి మండలంలో గులాబీ తుఫాన్ కారణంగా పాడైపోయిన పంట నష్టం గురించి, కొండిబ,టోకురు, బొర్రా పంచాయతీలను విస్తృతంగా పర్యటించి రైతు కష్టాలు తెలుసుకొని పంట నష్టాలను పరిశీలించి అధికారులకు తెలియపరుస్తానని అనంతగిరి మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు శ్రీమతి శెట్టి నీలవేణి విలేకరులకు తెలిపారు ఈ కార్యక్రమంలో భాగంగా పంచాయతీ టోకురుపంచాయతీ సచివాలయాన్ని సందర్శిచి సర్పంచ్ మొసియా ఎంపీటీసీల తుఫాన్ వలన నష్టం గురించి మాట్లాడి పంచాయతీ లో జరిగిన నష్టాన్ని తెలుసుకుని పరిశీలించి అక్కడ సర్పంచ్ ఎంపీటీసీ మండల అధ్యక్షుడు అధ్యక్షురాలు సాదరంగా ఆహ్వానించి వారి కష్టాలు తెలుసుకున్నారు ఈ కార్యక్రమంలో భాగంగా బుర్ర సర్పంచ్ ఎంపీటీసీ మరియు సర్పంచ్ ఎంపీటీసీ సర్పంచ్ లతో కలసి ఆయా పంచాయతీ లలో జరిగిన నష్టాలను అధికారుల దృష్టికి తీసుకు వెళతానని వారికి తెలపడం జరిగింది ఈ కార్యక్రమంలో భాగంగా కోఫ్షన్ మెంబర్ షేక్ మదీనా భీంపోలు ఎంపిటిసి శిరగం అశోక్ కుమార్ మరియు వైసీపీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు,

## ఆగాకరకు తీవ్ర నష్టం



ఆగాకర పంట

గొలుగొండ : మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆగాకర రైతులకు తీవ్ర నష్టం మిగిల్చింది. ఎల్లవరం, జోగుంపేట, గొలుగొండ, జిల్లేడుపూడి, కరక, రాజుపేట ప్రాంతాల్లో సుమారు 1000 ఎకరాల్లో సాగు చేపట్టారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు 100 ఎకరాల్లో ఆగాకర పాదులు నేలమట్ట మయ్యాయి. నష్టపరిహారం మంజూరు చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

## కాపు కులాన్ని కించపరిస్తే సహించం



నగిశెట్టి గంగబాబు

మాకవరపాలెం : కాపు కులాన్ని కించపరిస్తే సహించేది లేదని కాపు సంక్షేమ సేన అనకాపల్లి పార్లమెంట్ ఇన్చార్జ్ నగిశెట్టి గంగబాబు అన్నారు. పవన్కల్యాణ్తో ఎవరైనా మంత్రులకు విభేదాలు వస్తే ఎవరికి వారు విమర్శించుకుంటే తమకు అభ్యంతరం లేదని, కానీ విమర్శల పేరుతో కాపు కులాన్ని దుర్భాషలాడితే భవిష్యత్లో తగు మూల్యం చెల్లించాల్సి వస్తుందన్నారు. కాపు(కోటా)లో కులం పేరుతో మంత్రి పదవులు పొందిన వారు కులం కోసం ఏమి చేశారో ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. కాపు కులం కోసం ఏమి చేయకపోయినా బాధపడం కానీ బజారుకీడిస్తే తగిన గుణపాఠం చెబుతామని కాపు సంక్షేమ సేన తరపున హెచ్చరిస్తున్నామన్నారు.

## గులాబ్ తుఫాన్లో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

భీమునిపట్నం : గులాబ్ తూఫాన్ వలన ఈదురు గాలులకు భీమిలి ఆనందపురం పద్మనాభంలలో అనేక రకాల పంటలు నెల కూలి నీట మునిగాయని దీనివలన రైతులు తీవ్రంగా నష్ట పోయారని ప్రభుత్వం ఏమండలాని కి ఆ మండలం అధికారులు తో సర్వే.చేయించిన భూమి మీద పంట ఉండి తూఫాన్ తాకిడికి నెల కూలిన ప్రతి పంటకు ఆయా రైతులకు నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం పార్టీ భీమిలి మండల కమిటీ డిమాండ్ చేసింది.

సీపీఎం మండల కార్యదర్శి రవ్వ నర్సింగ్ రావు, కమిటీ సభ్యులు వి.నాగరాజు, ఎస్.అప్పల నాయుడులు డిమాండ్ చేశారు.

# ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ నిర్వహించిన జివిఎంసి యంత్రాంగం

**- జివిఎంసి కమిషనర్ డాక్టర్ జి. సృజన**




విశాఖపట్నం :- "గులాబ్" తుఫాన్ కారణంగా జివిఎంసి పరిధిలో జరిగిన పలు విపత్తులను అదుపులోనికి తీసుకువచ్చి, వాటి నివారణ చర్యలపై అన్ని విభాగాలతో కూడిన జివిఎంసి యంత్రాంగం ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్‌ను బుధవారం నిర్వహించిడమైనదని కమిషనర్ డాక్టర్ జి. సృజన పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. ఈ ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమాలలో భాగంగా, "గులాబ్" తుఫాను వలన నగరంలో గల అన్ని వార్డులలో చేరిన వర్షపు నీరు నిల్వలలో దోమలు వృద్ధిని నివారించేందుకు ప్రత్యేకంగా బుధవారంను విధిగా పాటించవలసినదిగా ప్రజలకు ముందుగా తెలియపరచడమైనదని కమిషనర్ తెలిపారు. ఈ రోజు "డ్రై డే" సందర్భంగా, ప్రతి ఇంటి పరిసరాలలో వర్షపు నీరు నిల్వలలో దోమలు వృద్ధి చెందే అవకాశం ఉందని, తద్వారా మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా తదితర సీజనల్ వ్యాధులు ప్రబల కుండా, ప్రజలు తగు జాగ్రత్తలు పాటిస్తూ, తమ ఇంటి పరిసరాలలో నీటి నిల్వలను గుర్తించి పూర్తిగా తొలగించి పారవేయవలసిందిగా అవగాహన పరచుటకు అన్ని సచివాలయాల వార్డు కార్యదర్శులు, వాలంటీర్లు, ఆర్.పి.లు, ఎస్.హెచ్.జి.లు ప్రతి ఇంటికి వెళ్లి దోమల నివారణ చర్యలు (ALO activities) స్వయంగా చేపట్టి, అవగాహన కార్యక్రమాలు, స్ప్రేయింగ్ కార్యక్రమాలు, చేపట్టడమైనదన్నారు. ముఖ్యంగా ఈ స్పెషల్ డ్రైవ్ లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా దోమలు వృద్ధిని అరికట్టుటకై, ప్రజలందరూ తమ తమ ఇంటి పరిసరాల పరిశుభ్రతపై అప్రమత్తంగా ఉండాలని, కాల్చి చల్లార్చిన నీటినే త్రాగాలని..., ప్రజా ప్రతినిధులు, వార్డు కార్పొరేటర్లు, పలు నివాసిత సంక్షేమ సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు పాల్గొని, పలు ర్యాలీలు నిర్వహించి ప్రజలకు అవగాహన పరచడమైనదన్నారు. ఈ స్పెషల్ డ్రైవ్ లో ప్రజల ఆరోగ్య పరిరక్షణ దృష్ట్యా ఈరోజు 121 వైద్య శిబిరాలు నిర్వహించడ మైనదన్నారు. ఈ వైద్య శిబిరాల నందు ప్రజలకు ఆరోగ్య పరీక్షలు, సేవలు అందించుటకు గాను, 72 మంది డాక్టర్లు, 484 మంది ఎ.ఎన్.ఎం.లు, 400 ఆశా వర్కర్లు పాల్గొని ప్రజలకు ఆరోగ్య తనిఖీలు నిర్వహించారన్నారు. ఈ వైద్య శిబిరాల్లో ఉచితంగా మందులు పంపిణీ చేయడమే కాకుండా కోవిడ్ టీకాలను వేసి మాస్కులను కూడా పంపిణీ చేయడం జరిగినదన్నారు. "గులాబ్" తుఫాను గాలివానలకు రోడ్లపై 200 పైచిలుకు కూలిన చెట్లు, కొమ్మలను రోడ్లపై ట్రాఫిక్ నకు, ప్రజల రాకపోకలకు అంతరాయం లేకుండా వాటిని తొలగించడమైనదన్నారు. వర్షాలకు దెబ్బతిన్న రోడ్లలో ఏర్పడిన చిన్నచిన్న గుంతలను పూడ్చే కార్యక్రమం జరుగుతుందన్నారు. గాలివానలకు దెబ్బతిన్న 1310 వీధి లైట్ల ను బాగు చేయడం జరుగుతుందన్నారు. 57 కిలోమీటర్ల మేర పొంగిపొర్లిన గెడ్డలలో, కాలువలలో, యూజీడీ లో, ఖాళీ స్థలాల్లో చేరిన వ్యర్థాలను తొలగించడం జరుగుతున్నాయని కమిషనర్ తెలిపారు.

ఈ స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ లో విధిగా ప్రజా ప్రతినిధులు, వార్డు కార్పొరేటర్లు, నివాసిత సంక్షేమ సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, ఎన్జీవో సొసైటీలు మరియు ప్రజలందరూ సహకరించినందుకు వారికి ప్రత్యేక కృతజ్ఞతలను కమిషనర్ తెలిపారు.



# వాగు లో గల్లంతైనా బాలుడు మృతదేహం లభ్యం





గాజువాక : రెండు రోజుల క్రిందట స్నేహితులతో కలిసి చేపల వేటకు వెళ్ళి గెడ్డ వాగులో కొట్టుకుపోయిన బాలుడు వంశీ రెడ్డి ఆచూకీ లభ్యమైంది. ఈ మేరకు 48 గంటల నుండి గాలింపు ముమ్మరం చేసిన రెవిన్యూ, ఎన్డీఆర్ ఎఫ్ సిబ్బందికి సర్ధర్ నెస్ట్ సమీపంలో గల గెడ్డలో బాలుడు మృతదేహన్ని అధికారులు గుర్తించారు. ఇదిలా ఉండగా కుటుంబ సభ్యులు సోకసంద్రంలో మునిగిపోయారు. అనంతరం బాలుడి మృత దేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం కెజిహెచ్ కి తరిలించారు . ఇటీవలే విశాఖలోని సుందరయ్య కాలనీ సమీపంలోని కాలువలో ఒక బాలుడు సోమవారం గల్లంతయ్యాడు. పెదగంట్యాడ మండలం సీతానగరం ప్రాంతానికి చెందిన కోరాడ కృష్ణ వంశీ రెడ్డి (16) చిన్నతనంలో తల్లిదండ్రులను కోల్పోయి తన చెల్లితో కలసి నానమ్మ, తాతయ్యల వద్ద ఉంటున్నాడు. నడుపూరు పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. సోమవారం సాయంత్రం ఇద్దరు స్నేహితులతో కలసి స్టీల్ ప్లాంట్ రైల్వే బ్రిడ్జ్ సమీప కాలువ వద్దకు చేపలు పట్టేందుకు వెళ్లాడు.

ఈ క్రమంలో కాలు జారిపోవడంతో ఉధృతంగా పారుతున్న కాలువలో పడిపోయాడు. వరద అధికంగా ఉండటంతో కొట్టుకుపోయాడు. స్నేహితులు సమాచారాన్ని అతడి కుటుంబ సభ్యులకు తెలియజేశారు. తరువాత స్టీల్ ప్లాంట్ పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

# అవంతి మాకవరపాలెంలో మెగా జాబ్ మేళా

## మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మోహన్‌రావు




గోడపత్రికను ఆవిష్కరిస్తున్న దృశ్యం

మాకవరపాలెం : ఆంధ్రప్రదేశ్ వైపూజ్య అభివృద్ది సంస్థ, అవంతి మాకవరపాలెం ఆధ్వర్యంలో కళాశాల మాకవరపాలెం అక్టోబరు 1న మెగా జాబ్‌మేళా నిర్వహి స్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మోహనరావు తెలిపారు. బుధవారం కళాశాలలో గోడ పత్రిక ఆవిష్కరించారు. ఈ జాబ్ మేళాలో మిరాకిల్ సాఫ్ట్వేర్ సిస్టమ్స్, ట్రిగొ టెక్నాలజిస్, బీడేటా టెక్నాలజీస్, వేన్ సాయి టీకాలస్, డెకన్ ఫైన్ కెమికల్స్, అలువిరా ఆనిమల్ ఫీల్డ్ లిమిటెడ్, సాయినార్ లేబరేటరి ప్రైవేల్ లిమిటెడ్, ట్రేజా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, సీడ్స్ ఇండిదం ప్రైవేట్ లివ పైనీర్ ఎలక్ట్రిక్ ప్రైవేట్ లివసీనరన్ కాస్టింగ్ వ్వెస్ క్రాఫ్, ఫెటిమ్, వరుణ్ మోటార్స్, సారణి ప్రైవేట్ ఫుడ్ లిమిటెడ్, టాట స్కై లివ జయచేరి ఆటో మోటివ్స్, హీరో మోటో కార్ కార్బన్ మెబైల్స్‌పై వివ రైజింగ్ స్టార్ ఇండియా, ప్రై.లి. డా. రాదికా మల్టీ స్పెసాలిటి హస్పిటల్, మెడ్ ఫ్లమ్, రిలయన్స్ జియో, అమర్ రాజా బోటరీస్, బి. న్యుమెటైల్స్ ప్రైవేట్ లివ కంపెనీలలో 2115 ఉద్యోగాలు కలవు వీటికి కావలసిన విద్యార్హతులు, ఇంటర్, డిప్లమా, డిగ్రీ, బిటిక్, ఎంబిఎలు అర్హులన్నారు.

ఈ కార్యక్రమంకు ముఖ్య అతిదులుగా కళాశాల వ్యవస్థాపక చైర్మన్, మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, అనకాపల్లి ఎంపి బి.సత్యవతి, నర్సీపట్నం ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్, జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు, కఅష్ణారావు, ఎన్‌టిపిసి జనరల్ మేనేజర్ దివాకర్ కౌశిక్ హాజరు కానున్నారన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత వినియోగించు కోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాది కల్పనాదికారి డాక్టర్ టి.శ్రీనివాసరావు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు

# ఘనంగా పల్లా జన్మదిన వేడుకలు



పరవాడ : పరవాడ మండలము పెదముషిడివాడ సర్పంచ్ పల్లా నాగమణి కుమారుడు పల్లా కబడ్డీ అప్పారావు జన్మదిన వేడుకులు బుధవారం అంగరంఘ వైభవంగా జరిగాయి.ముందుగా అయనకు చరవాణిద్వారా స్దానిక శాసనసభ్యులు అన్నంరెడ్డి అదీప్ రాజ్ ,పరవాడ ఎంపిపి పైలవెంకటపద్మలక్ష్మి శ్రీనువాస్ ,పరవాడ జడ్పిటిసి పియస్ రాజు,వైస్ ఎంపిపి బంధం నాగేశ్వరావుమరియు మండలములో గల నూతన సర్పంచ్ లు ఎంపిటిసిలు చరవాణిద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.పరవాడ న్యూ ప్రెస్ క్లబ్ అద్యక్షులు లాలంకృష్ణారావు,న్యూప్రెస్ క్లబ్ సెక్ర్యటరీ పైల సన్యాశినాయుడు కబడ్డీ అప్పారావుకు పుష్పగుచ్చం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.అనంతరము దుశాలువాతో సత్కరించారు.పెదముషిడివాడ పంచాయితీ పరిధిలో గల అన్నిగ్రామాల్లో కేక్ కట్ చేసిపంచిపెట్టారు, అనంతరము యూత్ సభ్యులు కబడ్డీ అప్పారావు అభిమానులు కార్యకర్తలు కబడ్డీ అప్పారావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.రాడ్ బాయ్స్ అద్వర్యంలో పల్లా కబడ్డీఅప్పారావు జన్మదిన వేడుకులు అంగరంఘ వైభవంగా జరిగాయి, కబడ్డీ అప్పారావు 29వ పుట్టినరోజు సందర్భంగా 29కేక్ లు పెట్టి కేక్ కట్ చేయించి పంచిపెట్టారు. అనంతరము రాడ్ బాయ్స్ యూత్ సభ్యులు పల్లా అప్పారావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసారు. అయన ఇటువంటి జన్మదిన వేడుకులు మరిన్నీ జరిపికోవాలానీ ,అయన ఎంచుకున్నరాజకీయరంగంలో ఉన్నతస్దాయికి ఎదుగాలానీ పలువురు అకాక్షించారు.

ఈకార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ నారాయణరావు,వైసిపినాయకులు ఒమ్మిఅర్జున్ ,వినోద్ కుమార్ , పల్లారామునాయుడు,,కార్యకర్తలు,కబడ్డీ అప్పారావు అభిమానులు రాడ్ బాయ్స్ సభ్యులు పెదముషిడివాడ యూత్ క్రికట్ యువకులు (రాడ్ బాయ్స్) రాజు, రమణ, నాగర్జున, సునీల్ జోషి, ప్రశాంత్, రమేష్ ,గొన్న భారత్,తేజ,బాబీ, శ్రీను, శేఖర్,భాస్కర్, హరీష్,రఘు,కార్తిక్, రాజు(బస్) తథితర్లు పాల్గోన్నారు.

# పోలీసు సంక్షేమానికి కృషి : ఎస్పీ రవీంధ్రనాథ్



కాకినాడ : పోలీసుల సంక్షేమానికి కృషి చేస్తానని జిల్లా ఎస్పీ ఎమ్.రవీంద్రనాథ్ బాబు అన్నారు.ఏపీ డీజీపీ గౌతం సవాంగ్ ఆదేశాల మేరకు,జిల్లా ఎస్పీ రవీంద్రనాథ్ బాబు ఆధ్వర్యంలో జిల్లా పోలీసు కన్వెన్షన్ హాల్ నందు "పోలీసు వెల్ఫేర్ డే" కార్యక్రమం బుధవారం జరిగింది.ఈసందర్భంగా ఎస్పీ బాబు మాట్లాడుతూ పోలీసు శాఖ లో విధి నిర్వహణలో అనేక మంది పోలీసు అధికారులు సిబ్బంది గత రెండు సంవత్సరాల కాలంలో కోవిడ్,అనారోగ్యం, రోడ్డు ప్రమాదాలు, సాధారణ మరణాలు ఇలా వివిధ కారణాలతో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యుల సంక్షేమం,ప్రభుత్వ పరంగా కుటుంబ సభ్యులకు రావలసిన రాయితీలు తదితర విషయలపై సమీక్ష చేయడానికి ఈకార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు.పోలీసు కుటుంబ సభ్యులకు పోలీసు శాఖ తరుపున ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా ఎల్లప్పుడు తాను అందుబాటులో ఉంటానని,పోలీసు కుటుంబ సభ్యులకు రావలసిన రాయితీలు, వారు ఎదుర్కొంటున్న సమస్యలకు సంబంధించి అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తారని,ఆర్ఐ వెల్ఫేర్ మరియు ఆర్ ఎస్సై వెల్ఫేర్ ఎల్లప్పుడు అందుబాటులో ఉంటారని తెలిపారు.ఈకార్యక్రమానికి హాజరైన విశ్రాంత ఉద్యోగుల సంఘంఅధ్యక్షులు, మెడికల్ బిల్స్, బరియల్ చార్జెస్ తదితర అంశాలపై విన్నవించుకోగా,సానుకూలంగా స్పందించిన ఎస్పీ తక్షణమే వాటి పరిష్కారం దిశగా ఈసమావేశానికి హాజరైన పోలీసు కార్యాలయ సంబంధిత పరిపాలన విభాగ అధికారులకు అక్కడికి అక్కడే చర్యలు తీసుకోవలసిందిగా సూచించారు.

# పేదలకు సమన్యాయం పై భరోసా

**- జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రామకృష్ణ**




శ్రీకాకుళం : జిల్లాలోని ప్రతి పేదవానికి సమన్యాయం అందుతుందనే భరోసా ఇచ్చే దిశగా న్యాయవ్యవస్థ, తపాలా శాఖ సమన్వయంతో పనిచేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రామకృష్ణ పిలుపునిచ్చారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో తపాలాశాఖ సిబ్బందితో అవగాహన కార్యక్రమం బాపూజీ కళా మందిర్ నందు బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రధాన న్యాయమూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్నేహపూర్వక న్యాయవ్యవస్థ రావాలనేది కేంద్ర, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల అభిప్రాయమని అన్నారు. అందులో భాగంగా ప్రతీ ఇంటికీ వెళ్లి సేవలు అందించే తపాలా శాఖ ద్వారా పేదప్రజలకు న్యాయవ్యవస్థ గురించి తెలియజేయాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ఆయన చెప్పారు. దేశవ్యాప్తంగా 2 లక్షల 90 వేల మంది పోస్టు మేన్లు, ఉమెన్లు సేవలు అందిస్తున్నారని, అందరితో బంధుత్వం కలిగిన వ్యక్తి పోస్టు మేన్లు మాత్రమేనని కొనియాడారు. అటువంటి తపాల శాఖ సిబ్బందితో న్యాయవ్యవస్థను సమ్మేళనం చేసుకుంటూ గ్రామస్థాయిలో న్యాయాన్ని అందించడమే దీని ముఖ్య ఉద్దేశ్యమని చెప్పారు. ప్రధానమంత్రి నుండి పోస్టు మేన్ వరకు సమన్యాయం అందించాలని భారత రాజ్యాంగం తెలియజేసిందని, ఆ మేరకు న్యాయం అందించాలనే లక్ష్యంతో ముందుకువెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రతి పోస్టు మేన్ కు స్మార్ట్ ఫోన్లు ఉన్నాయని, యాప్ డౌన్లోడ్ చేసుకొని గ్రామస్థాయిలో జరిగే న్యాయ సమస్యలపై సమాచారం అందిస్తే తక్షణమే మండల న్యాయ సేవాధికార సంస్థకు పంపడం జరుగుతుందని ఆయన చెప్పారు. పేదప్రజలకు న్యాయ సేవాధికార సంస్థ అందించే సేవలపై కరపత్రాలు, గోడపత్రికలు, బ్యానర్లు, స్వంత చిరునామా గల కవర్లను అందించడం జరుగుతుందని అన్నారు. తద్వారా గ్రామస్థాయిలో న్యాయవ్యవస్థపై అవగాహన కలుగుతుందని, నిరక్షరాస్యులకు ఈ వ్యవస్థపై అవగాహన కల్పించాలని వివరించారు. పోస్టు మేన్లు ఇది అదనపు భారంగా కాకుండా బాధ్యతగా, సామాజిక సేవగా గుర్తుంచుకోవాలని న్యాయమూర్తి పిలుపునిచ్చారు. న్యాయవ్యవస్థపై అవగాహన లేక నిరుపేదలు కోర్టులను ఆశ్రయించడం లేదని, ఆశ్రయిస్తే వారికి న్యాయస్థానానికి చెల్లించవలసిన రుసుమును రద్దుచేస్తూ, న్యాయవాదులను ఏర్పాటుచేసి నాణ్యమైన న్యాయం అందిస్తామనే భరోసా కల్పించాలని ప్రధాన న్యాయమూర్తి వివరించారు. న్యాయం అందదేమో అన్న భావన పేదల్లో పోవాలని, అందుకోసమే న్యాయవ్యవస్థ ప్రజల ముంగిటకు వచ్చిందని ఆయన గుర్తుచేసారు.

న్యాయవ్యవస్థ ద్వారా పిల్లలు, వృద్ధులు, మహిళలు, యస్.సి.,యస్.టి తెగలవారు, మతిస్థిమితం లేని వారు, కర్మాగార కూలీలు, విపత్తుకు గురై వార్షిక ఆదాయం రూ.3లక్షల లోపు గలవారు అర్హులని అన్నారు. జిల్లా, మండల స్థాయిలో న్యాయ సేవాధికార సంస్థలు పనిచేస్తున్నాయని, దూర ప్రాంతాల వారు తమ సమీప మండల కేంద్రంల్లోని న్యాయ సేవాధికార సంస్థల ద్వారా న్యాయ సహాయం పొందవచ్చని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.జయలక్ష్మి, తపాలా శాఖ సహాయ పర్యవేక్షకులు కె.మధుసూదన కుమార్, కె.శ్యామసుందర్ రావు, వి.వీరభద్రస్వామి, జి.రామారావు, తపాలా శాఖ పోస్టు మేన్లు తదితరులు పాల్గొన్నారు.

# తృటిలో తప్పిన పెను ప్రమాదం ...



విశాఖపట్నం :పంజాబ్ హెూటల్ కూడలి జాతీయ రహదారి వద్ద మంగళ వారం పెను ప్రమాదం తప్పింది. ఈమేరకు ఎన్. ఏడీ కూడలి నుండి తాటిచెట్లపాలెం వైపుగ వెళతున్న కారు పంజాబ్ హెూటల్ కూడలి జాతీయ రహదారి వద్ద మలుపు తిరుగుతున్న క్రమంలో వెనుకనుండి వస్తున్న లారీ బలంగా డీకొంది. దీంతో కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమయ్యింది. ఘటన స్థలానికి చేరుకున్న కంచరపాలెం ట్రాఫిక్ ఎస్. ఐ శ్రీనివాస్ పరిస్థితి సమీక్షించారు.

# ఘనంగా పోలీస్ వెల్ఫేర్ డే




విశాఖసిటీ : విశాఖపట్నం జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఐపిఎస్ వారి ఆధ్వర్యంలో పోలీస్ సంక్షేమ దినోత్సవం - 2021 సందర్భంగా 2020,2 021 సంవత్సరాలలో జిల్లా పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తూ, కోవిడ్ తో చనిపోయిన మరియు పదవీ విరమణ చేసిన మొత్తం 56 మంది పోలీసు అధికారుల కుటుంబ సభ్యుల సమస్యలు తెలిసికొని వారికి పోలీస్ శాఖ నుండి రావాల్సిన బెనిఫిట్స్, ఉద్యోగం తదితర అంశాలపై చర్చించి సమస్యలు పరిష్కరించడానికి ఈ సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లా ఆర్ముడు రిజర్వ్ కైలాసగిరి నందు జరిగిన ఈ సమావేశంలో చనిపోయిన పోలీసు అధికారుల (28), పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులు (21), కోవిడ్ తో చనిపోయిన పోలీసు అధికారులు (7) సివిల్, ఆర్ముడు రిజర్వ్, హెూమ్ గార్డ్ మరియు పోలీస్ కార్యాలయ సిబ్బంది కుటుంబ సభ్యులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. జిల్లా ఎస్పీ పోలీస్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ గౌరవ డిజిపి దామోదర్ గౌతమ్ సవాంగ్ ఐపిఎస్ ఉత్తర్వుల మేరకు రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో పోలీస్ సంక్షేమం, అక్టోబర్లో పోలీస్ సంస్మరణ దినోత్సవం సందర్భంగా సిబ్బందికి రావలసిన బెనిఫిట్స్ మరియు ఉద్యోగాల గురించి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే ఎవరెవరికి ఏం రావలసింది గుర్తించామన్నారు.ఉద్యోగాల విషయమై గౌరవ కలెక్టర్ తో మాట్లాడి పరిష్కరిస్తామన్నారు. ఖాళీలు, రోస్టర్ ప్రకారం ఉద్యోగాలు వస్తాయని , కుటుంబంలో నో ఎర్నింగ్ మెంబర్ సర్టిఫికెట్, లీగల్ హెయిర్ సర్టిఫికెట్ లు కార్యాలయంలో అందజేయాలన్నారు. కోవిడ్ తో చనిపోయిన పోలీసు పిల్లలకు పరివర్తన పేరుమీద చదువుకోడానికి ప్రభుత్వం బెనిఫిట్స్ కల్పించిందన్నారు. పదవీ విరమణ పొందిన ఎక్కువ మంది పోలీసులకు ఫైనాన్షియల్ బెనిఫిట్స్ పొందారన్నారు. మీరందరూ పోలీసు కుటుంబంలో సభ్యులని ఎటువంటి అవసరం వచ్చినా జిల్లా పోలీస్ వెల్ఫేర్ నోడల్ ఆఫీసర్ గా ఏ.ఆర్ డిఎస్పీ ఆర్.పి.ఎల్.శాంతికుమార్, దృష్టికి తీసుకొని వస్తే తక్షణమే పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామన్నారు. జిల్లా ఎస్పీ ఏవైనా సమస్యలు ఉంటే మాట్లాడాలని కోరగా సభ్యులు అడిగిన సందేహాలను ఎస్పీ మొత్తం విని వారికి అవగాహన కల్పించారు. అనంతరం జిల్లా ఎస్పీ గారు పోలీసు కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏ.ఆర్ డిఎస్పీ శ్రీ ఆర్.పి.ఎల్.శాంతికుమార్,ఏ.వో శ్రీమతి శారద, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు కె.వెంకట్రావు, కె.అరవింద్ కిషోర్, బి.రామకృష్ణారావు, ఎం.సతీష్, ఆర్ఎస్ఎ నాయుడు మరియు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# స్వామివారి సేవలో డా.పివిఆర్



రుషికేష్ గంగా నది తీరంలో పరమపవిత్రమైన చాతుర్మాస్య దీక్షను ముగించుకుని ఇటీవల విశాఖ శ్రీ శారదా పీఠాన్ని చేరుకున్నా విశాఖ శ్రీ శారదా పీఠాధిపతులు జగద్గురు శంకరాచార్య శ్రీశ్రీశ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి మహా స్వామి వారిని పీఠ ప్రాంగణంలో భక్తిపూర్వకంగా కలుసుకొని స్వామివారి ఆశీస్సులు అందుకుంటున్నా కళా హాస్పిటల్ అధినేత, వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ పైడి వెంకటరమణ మూర్తి.



# గీతం అడ్మిషన్ల సమాచారం

సాగర్‌నగర్ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ద్వారా నిర్వహిస్తున్న బిఎస్సీ, ఎమ్మెస్సీ కోర్సులలో ప్రవేశాలు నిర్వహిస్తున్నారు. ఇంటర్ బైపిసి సబ్జెక్టులతో ఉత్తీర్ణత అయిన విద్యార్థులకు బ్యాచులర్ ఆఫ్ ఎన్విరాన్ మెంటల్ మేనేజ్‌మెంట్ (బిఇఎమ్), బ్యాచులర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ (బిసిఎ), ఐదేళ్ల ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ, బిఎస్సీలో బయోకెమిస్ట్రీ, మైక్రోబయాలజీ, బయెఇన్ఫర్మేటిక్స్,బయోటెక్నాలజీ,ఫుడ్ టెక్నాలజీ కాంబినేషన్‌లతో కోర్సులను ఆఫర్ చేస్తున్నారు. అలాగే ఎంపిసి విద్యార్థులకు మేథ్స్,పిజిక్స్, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్, స్టాటిస్టిక్స్ కాంబినేషన్‌లతో బిఎస్సీ డిగ్రీ కోర్సులను ఆఫర్ చేస్తున్నారు. డిగ్రీ పూర్తి చేసిన వారికి ఎమ్మెస్సీలో అప్లైడ్ మేథ్స్, ఫిజిక్స్, డేటా సైన్స్, ఎలక్ట్రానిక్స్ సైన్స్, కెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, బయోకెమిస్ట్రీ, మైక్రోబయాలజీ, బయోటెక్నాలజీ, ఫుడ్ సైన్స్ టెక్నాలజీ కోర్సులు నిర్వహిస్తున్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ద్వారా నిర్వహిస్తున్న ఎంబిఎ, బిబిఎ, బికామ్, కోర్సులలో 2021 విద్యాసంవత్సరం ప్రవేశాలు నిర్వహిస్తున్నారు. అండర్ గ్రాడ్యుయేట్ స్థాయిలో బిబిఎ మేనేజ్‌మెంట్ అకౌంటింగ్, బిబిఎ ఫిన్‌టెక్, బిబిఎ లాగిస్టిక్స్, బిబిఎ ఫైనాన్స్‌యల్ మార్కెట్స్, బిబిఎ బిజినెస్ అనలటిక్స్, బిబిఎ ఎంట్రప్రెన్యూర్ కోర్సులను, అంతర్జాతీయ అకౌంటింగ్ సంస్థలు సీమా, ఎసిసిఎలతో కలసి బ్యాచులర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ కోర్సును, బికాం (ఆనర్స్) కోర్సును నిర్వహిస్తున్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మశీ ద్వారా 2021 విద్యా సంవత్సరానికి బి.ఫార్మశీ కోర్సులో అడ్మిషన్లు నిర్వహిస్తున్నారు. బిఫార్మశీ కోర్సులో ప్రవేశానికి ఇంటర్‌మీడియట్ లేదా తత్సమాన పరీక్షలో బైపిసి లేదా ఎమ్‌పిసి సబ్జెక్టులలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ ద్వారా 2021 విద్యా సంవత్సరానికి బి.ఆర్క్ కోర్సులో అడ్మిషన్లు నిర్వహిస్తున్నారు. బి.ఆర్క్ కోర్సులో ప్రవేశానికి జాతీయ స్థాయి నాటా పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులు. గీతం స్కూల్ ఆఫ్ ఫిజియో థెరపీలో ఈ ఏడాది 2021 విద్యా సంవత్సరం నుంచి కొత్తగా నాలుగేళ్ళ కాలవ్యవధి గల ఫిజియో థెరపీ కోర్సుకు అడ్మిషన్లు ప్రారంభించారు. ఇంటర్‌లో బయాలజీ, పిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులలో 60 శాతం మార్కులు సాధించిన విద్యార్థులు ఈ కోర్సుకు ధరఖాస్తు చేసుకోవచ్చు. ఈ ఏడాది జాతీయ స్థాయిలో జరిగే నీట్ ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారు లేదా గీతం ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారికి ప్రవేశాలు కల్పిస్తారు.

ఈ కోర్సులలో ప్రవేశానికి సంభందించి అర్హతలు, ఫీజల వివరాలు, ఆన్‌లైన్ ధరకాస్తులకు వెబ్ సైట్ www.gitam.edu ను పరిశీలించవచ్చు.

## గులాబ్ తుఫాన్ లో నష్టపోయిన ప్రాంతాలను
# జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లిఖార్జున ఆకస్మిక తనిఖీ






విశాఖపట్నం : గులాబ్ తుఫాన్ లో నష్టపోయిన ప్రాంతాలను జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లిఖార్జున ఆకస్మిక తనిఖీ చేసారు. బుధవారం మునగపాక, కశింకోట మండలాలలో అనకాపల్లి పార్లమెంట్ సభ్యురాలు బి.సత్యవతి తో కలిసి పర్యటించారు. మునగపాక మండలం గణపర్తి శారదానది గట్టు వరద తాకిడికి కోసుకు పోయి ప్రమాదకర పరిస్థితి ఏర్పడటాన్నిగమనించి తక్షణ తాత్కాలిక చర్యలు చేపట్టాల్సింది గా సంబందిత ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. కశింకోట మండలం తేగాడ గ్రామం జగనన్న కాలనీ లో గృహనిర్మాణ పనులను పరిశీలించారు. కాలనీ లబ్దిదారురాలు నీటిపల్లి దుర్గతో కలెక్టర్ మాట్లాడి గృహనిర్మాణ సామాగ్రి సకాలంలో అందిస్తున్నది లేనిది అడిగి తెలుసుకున్నారు. హౌసింగ్ అధికారులు నిర్దేశించిన లక్ష్యాలలో నిర్మాణ పనులను వేగవంతం చేయాల్సిందిగా ఆదేశించారు. కశింకోట మండలం తేగాడ, మునగపాక మండలం గంటవానిపాలెం గ్రామ సచివాలయాలను ఆకస్మిక తనిఖీ చేసారు. అక్కడి సిబ్బందితో అర్హులైన లబ్దిదారులకు స్కీమ్ లు అందుతున్నాయి లేనివి అడిగి తెలుసుకున్నారు. వ్యాక్సినేషన్ కార్యక్రమం ఎంత వరకు వచ్చినది ఏ.ఎన్.ఎం ను అడుగగా మొదటి డోసు అయిపోయినదని, రెండవ డోసు 50 శాతం మాత్రమే చేసామని తెలుపగా అందుకు కలెక్టర్ మిగిలిన వారికి కూడా వ్యాక్సినేషన్ చేయాలని ఆదేశించారు. కలెక్టర్ పర్యటనలో ఆర్.డి.ఓ సీతారామారావు, తాసిల్దార్లు హాజరైయారు.

# మండలాల అభివృద్ధిలో ఎంపీపీలదే కీలక పాత్ర

**- ప్రజలకు అందుబాటులో ఉండాలి - సమస్యల పరిష్కారమే ప్రధమ ధ్యేయంగా పనిచేయండి**

**- చిలకలూరిపేట శాసనసభ్యురాలు విడదల రజిని**



చిలకలూరిపేట : మండలాల అభివృద్ధిలో ఎంపీపీలదే కీలక పాత్ర అని చిలకలూరిపేట శాసనసభ్యురాలు విడదల రజిని తెలిపారు. నూతనంగా ఎన్నికైన మూడు మండలాల పరిషత్ అధ్యక్షులు స్థానిక శాసనసభ్యురాలి కార్యాలయానికి బుధవారం వచ్చి ఎమ్మెల్యే విడదల రజిని ని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలకతీతంగా అర్హులకు ప్రభుత్వ ఫలాలు అందేలా స్థానిక సంస్థల నాయకులు పనిచేయాలని సూచించారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని చెప్పారు. మండలాల అభివృద్ధి ఎంపీటీసీ సభ్యులు, ఎంపీపీల చేతుల్లోనే ఉందని వెల్లండిచారు. బాగా పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలని కోరారు. పదవులను బాధ్యతగా భావించాలని, అప్పుడే ఆ పదవులకు న్యాయం చేయగలుగుతామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా చిలకలూరిపేట, నాదెండ్ల, యడ్లపాడు మండలాల అధ్యక్షులు దేవినేని శంకరరావు, తలతోటి రాణి, పిడతల ఝాన్సి తదితరులు ఎమ్మెల్యే ని ఘనంగా సత్కరించారు.

# తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో నష్ట నివారణ చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించిన కె.కె రాజు



సీతమ్మధార : గులాబ్ తుఫాన్ నేపథ్యంలో విశాఖ ఉత్తర నియోజకవర్గంలో జరిగిన నష్టాన్ని పరిశీలించి బాధితులకు వెంటనే నష్ట పరిహారం వచ్చేలా చూడాలని అలాగే ఆస్తి నష్టం ఏదైనా జరిగి ఉంటే ఆసమస్యలను వెంటనే పరిశీలించి పరిష్కార చర్యలు తీసుకోవాలని నెడ్ క్యాప్ చైర్మన్,విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె రాజు అధికారులతో మాట్లాడారు. అంతకు ముందు నియోజకవర్గంలో గల కార్పొరేటర్లు, నాయకులు కె.కె రాజు ని కలిసి వార్డుల వారీగా వారి వారి ఏరియాలో జరిగిన తుఫాన్ నష్ట వివరాలు అందజేశారు.

ఈ కార్య క్రమంలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరావు,స్టాండింగ్ కమిటీ మెంబర్ శశికళ,14వార్డు కార్పొరేటర్ కటారి అనిల్ కుమార్ రాజు,48వార్డు ఇంచార్జ్ నీలిరవి, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS .,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com